

గాయపడిన ఫొటోగ్రాఫరు శ్రీకృష్ణ

సిద్ధం అరాచకానికా?

'సిద్ధం' అంటూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి సభలు పెట్టేది మీడియాపై అరాచకం చేసేందుకా?.. అని నాయకులు, ప్రజాస్వామ్యవాదులు, జర్నలిస్టు సంఘాల నేతలు ప్రశ్నిస్తున్నారు. అనంతపురం జిల్లా రాప్తాడులో ఆదివారం జరిగిన వైసీపీ 'సిద్ధం' సభ కవరేజీ కోసం వెళ్లిన 'ఆంధ్రజ్యోతి' ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీ మూకల విచక్షణరహిత దాడిని ఖండించారు. సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయిన దాడి దృశ్యాలను చూసిన వీరంతా దిగ్భ్రమ చెందారు. ఇలాంటి అమానుష చర్యలను ప్రతి ఒక్కరూ ఖండించాలని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్యబద్ధంగా రాజకీయాలు చేయాలేగానీ ఇలా దాడులకు దిగడం సరికాదని హితవు పలికారు. ఈ దాడులకు నిరసనగా సోమవారం జిల్లా అంతటా నిరసనలు, ధర్నాలు చేపట్టనున్నట్లు తెలిపారు.

- చిత్తూరు, ఆంధ్రజ్యోతి



ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫరు పై దాడికి నిరసనగా ఆదివారం రాత్రి తిరుపతి నగరంలోని భవానీ నగర్ సర్కిల్లో ఆందోళన చేస్తున్న టీడీపీ శ్రేణులు

● రాప్తాడులో 'ఆంధ్రజ్యోతి' ఫొటోగ్రాఫర్‌పై దాడిని ఖండించిన పార్టీలు, ప్రజాస్వామ్యవాదులు

తప్పులు ఎత్తిచూపితే దాడులు చేస్తారా?



ప్రభుత్వ తప్పులను ఎత్తి చూపించే బాధ్యత మీడియాది. మీరు చేసే అక్రమాలు, భూదందాలను ఎత్తి చూపితే ఇలా దాడులు చేస్తారా? దమ్ముంటే మంచి చేసి చూపించండి. రాప్తాడులో సిద్ధం సభకు జనం తక్కువగా ఉండటాన్ని మీడియా కవర్ చేయకుంటే ఎలా? వైసీపీని ప్రజలు ఇంటికి పంపించే సమయం దగ్గరపడింది.

- దొరబాబు, మాజీ ఎమ్మెల్సీ, చిత్తూరు

ఓడిపోతారని తెలిసే..



రానున్న ఎన్నికల్లో వైసీపీ ఓడిపోవడం ఖాయం. అందుకనే ఇటువంటి దుర్మార్గపు చర్యలకు పాల్పడుతున్నారు. వైసీపీ పాలనలో ఇటువంటి దాడులు సర్వసాధారణంగా మారింది. దీనికి చరమగీతం పాడే రోజులు దగ్గర పడ్డాయి.

- నాగరాజు, సీపీఐ జిల్లా కార్యదర్శి

జర్నలిస్టులపై దాడి అమానుషం



ప్రజాస్వామ్యాన్ని, చట్టాలను ఏమాత్రం గౌరవించకుండా వైసీపీ నాయకులు, కార్యకర్తలు రౌడీల్లా దాడులు చేయడం పెరిగిపోయింది. ఒకవైపు ప్రశ్నించే ప్రతిపక్షాలపై.. మరోవైపు నిజాలను చూపే జర్నలిస్టులపై దాడులు దుర్మార్గం. వైసీపీ తొత్తులుగా ఉండే కొందరు పోలీసు అధికారుల వల్లే దౌర్జన్యాలు, అక్రమాలు పెరుగుతున్నాయి. పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరిస్తే ఇలాంటి ఘటనలు జరగవు.

- రామచంద్రయాదవ్, బీసీవై పార్టీ అధ్యక్షుడు

ఇది మొత్తం మీడియాపై దాడే



ఇది ఒక ఫొటోగ్రాఫరుపై జరిగింది కాదు.. మొత్తం మీడియాపై జరిగిన దాడి. ఇది చాలా దారుణం. రాష్ట్రంలో అరాచకపాలన నడుస్తోందని దీనిని చూస్తే అర్థమవుతుంది. ఈ దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం.

- వాడ గంగరాజు, సీపీఎం జిల్లా కార్యదర్శి

ఫొటోగ్రాఫరుపై దాడి దుర్మార్గం



సీఎం సభలోనే ఫొటోగ్రాఫరు శ్రీకృష్ణను విచక్షణారహితంగా కొట్టడం అమానవీయం. దాడుల సంస్కృతి మంచిదికాదు. జగన్ ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయి. పోలీసులు వెంటనే నిందితులను అరెస్టు చేసి చర్యలు తీసుకోవాలి.

- చల్లా రామచంద్రారెడ్డి, పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జి

అన్ని వర్గాలపైనా వైసీపీ దాడులు



సమాజానికి మేలు చేసే పాత్రికేయుల మీద ఇలా వైసీపీ నేతలు దాడి చేయడం మంచి పద్ధతి కాదు. దీన్ని బీజేపీ తరఫున తీవ్రంగా ఖండిస్తున్నాం. పాత్రికేయులు అనే కాదు, అన్ని వర్గాల మీద కూడా వైసీపీ దాడులు అధికమయ్యాయి. ప్రభుత్వానికి బాధ్యత లేకుండా పోతోంది.

- చిట్టిబాబు, బీజేపీ నేత, చిత్తూరు

ఇది ప్రజాస్వామ్యంపై దాడి



రాప్తాడులో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ మీద జరిగిన దాడిని ప్రజాస్వామ్యంపై దాడిగా భావిస్తున్నాం. దాడి చేసినవారిని కఠినంగా శిక్షించాలి. అప్పుడే మరోసారి ఇలాంటి ఘటనలు పునరావృతం కావు. ప్రభుత్వం బాధ్యత వహించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి.

- పి.భాస్కర్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు

ఈ సంస్కృతిని ఏ పార్టీ ప్రోత్సహించకూడదు



ప్రజాస్వామ్యంలో అందరికీ రాజ్యాంగం స్వేచ్ఛ ఇచ్చింది. ఇలా పాత్రికేయుల మీద దాడి చేయడం అమానుషం. ఇలాంటి వాటిని ఏ పార్టీ ప్రోత్సహించకూడదు. భవిష్యత్తులో మరిన్ని ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంటుంది.

- దయారామ్, జనసేన నేత, చిత్తూరు

నేడు నిరసనలు

రాప్తాడులో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫరు మీద వైసీపీ శ్రేణుల దాడిని ఖండిస్తూ సోమవారం జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో రాజకీయ పార్టీలు, జర్నలిస్టు సంఘాల ఆధ్వర్యంలో ఆందోళనలు జరగనున్నాయి. చిత్తూరులోని గాంధీ విగ్రహం వద్ద టీడీపీ, కాంగ్రెస్, బీజేపీ, వామపక్షాలు, జనసేన, ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో విడివిడిగా నిరసనలు చేయనున్నారు. ఈ ఆందోళనలకు కార్మిక, ప్రజాసంఘాలు, ప్రజాస్వామ్యవాదులు, పార్టీలకు అతీతంగా శ్రేణులు హాజరు కావాలని వీరు కోరారు.

సీఎం సభలో దాడి చేస్తున్నా..



సాక్షాత్తు సీఎం సభలో వేలాది మంది చూస్తుండగా వైసీపీ వాళ్లు ఫొటోగ్రాఫరుపై దాడి చేశారు. ఇలా దాడి చేస్తున్నా ఎవరూ అడ్డుకోకపోవడం దారుణం. ఏ కార్యక్రమాన్ని అయినా కవర్ చేసే స్వేచ్ఛ రిపోర్టర్లకు, ఫొటోగ్రాఫర్లకు ఉంది. ప్రభుత్వాలు ఏవైనా ఇలా పాత్రికేయుల మీద దాడి అమానుషం.

- లక్ష్మీపతి, జర్నలిస్ట్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి

పత్రికా స్వేచ్ఛకు విఘాతం



ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై దాడి దారుణం. దాడుల సంస్కృతి పత్రికా స్వేచ్ఛకు విఘాతం కలిగిస్తుంది. నిన్న అమరావతి, నేడు రాప్తాడులో జర్నలిస్టులపై దాడి చేసినవారిపై తక్షణమే కేసు నమోదు చేయాలి. లేకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతాం.

- అశోక్, చిత్తూరు ప్రెస్‌క్లబ్ ప్రధాన కార్యదర్శి

దాడులు మంచి పద్ధతి కాదు



ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై అధికార పార్టీ కార్యకర్తలు పాశవికంగా భౌతిక దాడులు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. పత్రికారంగాన్ని అధికారంలో ఉన్నవారు గౌరవించే సంప్రదాయాన్ని పాటించకుండా దాడులు చేయడం మంచి పద్ధతి కాదు. ఫొటోగ్రాఫర్ వృత్తిధర్మాన్ని పాటించారే కానీ, వ్యక్తిగత కక్షలకు రాలేదన్న స్పృహ ఉండాలి. ఇలాంటివి పునరావృతం కాకుండా అధికార పార్టీ నాయకులు సంయమనం పాటించాలి.

- రాకేష్‌రెడ్డి, పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్



వర్దికుప్పం వద్ద ఎండిపోయిన కాలువ

■ మాయా'జలం'

హంద్రీ-నీవా.. ఎన్నికల గట్టెక్క నీవా!

● వాపోతున్న వైసీపీ శ్రేణులు ● కనీసం లైనింగ్ పూర్తి చేయని కాలువ
● లిఫ్టులతో ఎత్తిపోసినా ఎండిపోతున్న జలం ● 26న జగన్ పర్యటన?
● నిండిన కాలువ చూపడానికి అధికారుల పాట్లు

హంద్రీ-నీవా కాలువ వైసీపీకి ప్రాణావసరంలా మారిపోయింది. ప్రస్తుతం కుప్పం రాజకీయం ఈ కాలువ చుట్టూనే తిరుగుతోంది. అదిగో నీళ్లు వచ్చేశాయని అధికార పార్టీ.. ఏదీ ఎక్కడ? అంటూ ప్రతిపక్ష పార్టీ సోషల్ మీడియా వేదికగా వాదోపవాదాలకు దిగుతున్నాయి. అధికార పార్టీ నేతల ఒత్తిడితో లేని జలాలతో కాలువను నింపడానికి మరోవైపు అధికారులు పడరానిపాట్లు పడుతున్నారు. ఈనెల 26వ తేదీన సీఎం జగన్ కుప్పం పర్యటన దాదాపు ఖరారైందని చెబుతున్న నేపథ్యంలో వారి మెడల మీద కత్తి వేలాడుతోంది. సారు వచ్చే సమయానికి నీళ్లతో కాలువ మొత్తం కళకళలాడాలన్న ఆదేశాలతో ఊపిరి తిప్పుకోలేక పోతోంది అధికార యంత్రాంగం.

కుప్పం, ఫిబ్రవరి 18: గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో సొంత నియోజకవర్గమైన కుప్పం తాగు, సాగునీటి అవసరాలు తీర్చడానికి చంద్రబాబు హంద్రీ-నీవా కాలువ కుప్పం బ్రాంచి కెనాల్ పనులను తలకెత్తుకున్నారు. కృష్ణా జలాలను కుప్పం మండలంలోని పరమసముద్రం చెరువుకు చేర్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఈ మధ్యలో రామకుప్పం, శాంతిపురం, గుడుపల్లె, కుప్పం మండలాల్లోని పలు చెరువులను హంద్రీ-నీవా జలాలతో నింపాలన్న బృహత్ప్రణాళిక తయారు చేసుకుని, కాలువ నిర్మాణంకోసం రూ.468 కోట్లు విడుదల చేశారు. పనులు శరవేగంగా సాగాయి. ఎన్నికలు సమీపించే నాటికి సుమారు 75-80 శాతం పనులు పూర్తి చేసి, వి.కోట వరకు హంద్రీ-నీవా జలాలను తీసుకొచ్చారు.



గుండిశెట్టిపల్లె వద్ద చెట్టుపుట్టలతో కనిపిస్తున్న హంద్రీ-నీవా కాలువ కట్టలు

మాయాజాలం బట్టబయలు

సీఎం పర్యటన నేపథ్యంలో హంద్రీ-నీవా కాలువ పూర్తి అయిపోయి నీళ్లు పుష్కలంగా తరలి వచ్చేస్తున్నట్లు కలరింగ్ ఇవ్వడానికి సుమారు పక్షం రోజులుగా స్థానిక వైసీపీ నేతలు చేస్తున్న ప్రయత్నాలు ఎదురు తిరుగుతున్నాయి. కాలువలో నీళ్లు లేవు కాబట్టే సీఎం పర్యటన మూడుసార్లు వాయిదా పడిందన్నది బహిరంగ రహస్యం. ఈ వాస్తవం ఒప్పుకోవడానికి అధికార పార్టీలో ఎవరూ సిద్ధంగా లేరు. ఎలాగైనా హంద్రీ-నీవా కాలువలో నీటిని చూపించాలన్న తాపత్రయంతో సీఎం వచ్చేస్తున్నారన్న ప్రతిసారీ హంద్రీ-నీవా కాలువలోకి నీళ్లు వదిలే ప్రయత్నాలు జరిగాయి. చివరిసారిగా సుమారు వారం రోజుల క్రితం కాలువలో నీళ్లు కనిపించాయి. అయితే ఇలా చేసిన ప్రతిసారీ నీళ్లు వదిలిన సుమారు మూడునాలుగు రోజులకే కాలువ పూర్తిగా ఎండిపోయింది. ఇప్పుడు కూడా అక్కడక్కడా గుంతల్లో అరడుగు మడుగులు తప్ప కాలువ అంతా ఖాళీగా ఎండిపోయే ఉంది. దీంతో హంద్రీ-నీవా కాలువ పనులు పూర్తి చేయకనే ప్రజలను మాయచేయడానికి అధికార పార్టీ ప్రయత్నిస్తున్నదన్న వాస్తవం ప్రజలకు తెలిసి వచ్చింది. కృష్ణానదిలోనే జలాలు లేనప్పుడు తాము మాత్రం కాలువలోకి నీళ్లు ఎలా తేగలమంటూ హెచ్ఎన్ఎస్ఎస్ అధికారులు వాపోతున్నారు. పుంగనూరు సమ్మర్ స్టోరేజీ ట్యాంకునుంచి వి.కోట మండలం ఆదినపల్లె లిఫ్ట్ పాయింట్‌కు నీటిని ట్యాంకర్ల ద్వారా తరలించి, అక్కడినుంచి రామకుప్పం మండలం వర్దికుప్పం చేరేలా తాత్కాలిక ఏర్పాట్లు చేస్తున్నట్లు వినిపిస్తోంది. అయితే హంద్రీ-నీవా కాలువలోకి అప్పుడప్పుడైనా సరే నీళ్లు ఎలా వస్తున్నాయన్న రహస్యాన్ని అధికారికంగా వెల్లడించడానికి ఎవరూ ఇష్టపడడంలేదు.

అందుకే తొందర

మార్చి నెల వచ్చిందంటే ఎన్నికల నోటిఫికేషన్ వెలువడుతుంది. అప్పుడిక అభివృద్ధి పేరుతో ఈ ప్రారంభ కార్యక్రమాలు చేసే అవకాశం ఉండదు. ఆలోగానే కుప్పం ప్రజలకు హంద్రీ-నీవా జలాలను తెచ్చిన అపర భగీరథుడిగా తమ నాయకుడిని చూపడానికి వైసీపీ నాయకులు తంటాలు పడుతున్నారు. మరోవైపు సీఎం పేషీ కూడా ఇదే కారణంతో జలాలను ఎలాగైనా నింపాలంటూ అధికారులపై ఒత్తిడి తెస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే మూడుసార్లు వాయిదా పడిన సీఎం పర్యటన ఈసారి ఈనెల 26వ తేదీన దాదాపు ఖరారైంది. సభ జరిగేది మఠం వద్దనే అయినా, ఆ సమీపంలోని గుండిశెట్టిపల్లెకు ఎత్తిపోసే జలాలు రాలేవు కాబట్టి, దానికి ముందుగా ఉన్న రామకుప్పం మండలం వర్దికుప్పం వద్దనే హంద్రీ-నీవా కాలువను సీఎం లాంఛనంగా ప్రారంభిస్తారని అధికార పార్టీ నాయకులు చెబుతున్నారు. తిమ్మిని బమ్మిని చేసైనా సరే, కాలువలో నీటిని పారించి, వారి మాటలు నిజం చేయాల్సిన అక్కర ఇప్పుడు అధికార యంత్రాంగంపై పడింది.

ప్రభుత్వం మారడంతో కదలని ప్రాజెక్టు

2019లో టీడీపీ అధికారం కోల్పోయి వైసీపీ గద్దెనెక్కడంతో హంద్రీ-నీవా కాలువ పనులు సుప్తావస్థలోకి జారిపోయాయి. నాలుగున్నరేళ్ల పాలనలో ఈ కాలువ గురించి సీఎం జగన్ పట్టించుకున్న పాపాన పోలేదు. హెచ్ఎన్ఎస్ఎస్ అధికారులతో ఒక్కటంటే ఒక్క సమావేశం కూడా నిర్వహించలేదు. నిధుల విడుదల జరగనేలేదు. ప్రభుత్వ వ్యతిరేకత క్రమేణా పెరుగుతుండడంతో జగన్‌కు ఏదో ఒక ఎన్నికల పథకం అవసరమైంది. గట్టి అభివృద్ధి ఒక్కటైనా చేసి చూపించాలన్న, కనీసం అలా మాయాజాలం చేయాలని లేదంటే కుప్పంలో కనీస పోటీనివ్వడం కష్టమన్న వాస్తవం తెలిసి వచ్చింది. 'వైనాట్ 175' అని కుప్పం కూడా నాదేనని వేదికలెక్కి మాట్లాడినంత ఈజీగా ఇక్కడ పరిస్థితి లేదన్న వాస్తవం స్పష్టమైంది.

చంద్రబాబు చేసిన పనులే

జగన్‌కు వాస్తవం తేటపడడంతో హంద్రీ-నీవా కాలువ పనులు హఠాత్తుగా గుర్తుకొచ్చాయి. అంతే.. కొన్ని నెలలనుంచీ అరాకొర నిధులు విడుదల చేసి, చేసీచేయనట్లుగా పనులు చేస్తున్నట్లు కలరింగ్ ఇస్తూ వచ్చారు. అయితే నియోజకవర్గ పరిధిలో కాలువ సాగినంత మేరా పరిస్థితిని పరిశీలిస్తే జరిగిన పనులు ఎటువంటివో తెలిసి వస్తుంది.

● శాంతిపురం మండలం గుండిశెట్టిపల్లె వద్ద చంద్రబాబు హయాంలో కాలువకు చేసిన లైనింగ్ పనులు తప్ప మళ్లీ ఏరకమైన పనులు జరిగిన సూచనలు కనిపించలేదు.

● రామకుప్పం మండలం వర్దికుప్పం తదితర ప్రాంతాల్లో కాలువ రెండువైపులా చెట్టుపుట్టలు పెరిగిపోయాయి. వాస్తవాలు ఇలా ఉంటే.. హంద్రీ-నీవా కాలువ పూర్తిగా నిర్మించేశామని స్థానిక వైసీపీ నేతలు ఊదరగొట్టసాగారు. ఈ ప్రచార హోరులోనే సీఎం జగన్ కుప్పం పర్యటనకు వస్తున్నట్లు ప్రచారాలు మొదలయ్యాయి. ఈనెల 5, 12, 16 తేదీలు మారి చివరకు 26వ తేదీన సీఎం పర్యటన ఖరారైనట్లు అధికార పార్టీ శ్రేణులు చెబుతున్నాయి. సీఎం సభకోసం శాంతిపురం మండలం మఠం వద్ద సభాస్థలిని కూడా సిద్ధం చేస్తున్నారు.

● వి.కోట మండలం ఆదినపల్లె లిఫ్ట్ పాయింట్‌తో మొదలై రామకుప్పం మండలం వర్దికుప్పంనుంచి సాగుతూ వచ్చే కాలువ ఇక్కడ అంతమై పైపులైన్ల ద్వారా గ్రావిటీ మీద, మళ్లీ కాలువ రూపంలో సిద్దావూరు తదితర గ్రామాల మీదుగా గుడుపల్లె, అనంతరం కుప్పం మండలంలోని గమ్యస్థానమైన పరమసముద్రం చెరువుకు చేరుతుంది. నియోజకవర్గ పరిధిలో కాలువ పొడవు 139 కిలోమీటర్లు. ఎక్కడైనా సరే, చంద్రబాబు హయాంలో చేసిన లైనింగ్ పనులు తప్ప మళ్లీ అటువంటి పనులు జరగలేదు.



చంద్రబాబు హయాంలో గుండిశెట్టిపల్లె వద్ద కాలువకు లైనింగ్ పనులు




వైసీపీ అధికారంలోకి వచ్చాక కనీసం లైనింగ్ పనులు చేయని కాలువ

ఎన్నికల్లో నియంత్రించాలనే

టీడీపీ నేతలపై రౌడీషీట్లు

● ఎత్తివేయాలంటూ డీజీపీకి చంద్రబాబు లేఖ



కుప్పం, ఫిబ్రవరి 18: కుప్పం నియోజకవర్గంలో టీడీపీ నేతలపై పెట్టిన తప్పుడు కేసుల ఆధారంగా దురుద్దేశంతో పోలీసులు తెరుస్తున్న రౌడీషీట్లను ఎత్తేయాలని కోరుతూ ఆ పార్టీ అధినేత చంద్రబాబు డీజీపీకి లేఖ రాశారు. ఎన్నికల్లో చురుకైన నాయకులు, కార్యకర్తల కదలికలను నియంత్రించాలనే నేరపూరిత కుట్ర ఇందులో దాగున్నదని ఆరోపించారు. టీడీపీ అధినేత చంద్రబాబు ఈనెల 17వ తేదీన రాష్ట్ర డీజీపీకి రాసిన లేఖ సారాంశం ఇదీ.. 'నేను 1989 నుంచి కుప్పం నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్నా. శాంతియుత, ప్రజాస్వామ్యయుతంగా నిరసనలు చేపడుతున్న తెలుగుదేశం నేతలపై పోలీసులు తప్పుడు, పనికిమాలిన కేసులు పెట్టి వేధిస్తున్న సంగతి తెలిసిందే. ఇలాంటి తప్పుడు కేసుల ఆధారంగా పోలీసులు, టీడీపీ నేతలపై రౌడీషీట్లు తెరుస్తున్నారు. రాబోయే ఎన్నికల్లో టీడీపీ నేతల కదలికలను పరిమితం చేయాలనే నేరపూరిత కుట్రతో ఇది జరుగుతోంది. దురదృష్టవశాత్తు అధికార వైసీపీ నేతలతో చురుగ్గా సహకరిస్తున్న ఒక వర్గం పోలీసు అధికారులు ఈ కుట్రకు పాల్పడుతున్నారు. వైసీపీ వైసీపీ నేతల ఆదేశాల మేరకు చురుగ్గా ఉన్న టీడీపీ నేతలను పోలీసులు టార్గెట్ చేసుకున్నారు. కుప్పం మున్సిపాలిటీలో ఎస్.రాజ్‌కుమార్, కన్నన్, అప్పు అలియాస్ ముఖేశ్, సుజిత్, దిలీప్, రామకుప్పం మండలంలో బి.గజేంద్ర, బి.మనోహర్, సాయి, జైశంకర్, శంకరాచలం, రాజమణి తదితరులను పోలీసులు రౌడీషీట్లు తెరిచే రూపంలో వేధిస్తున్నారు. ప్రజాస్వామ్య స్ఫూర్తికి ముప్పులాంటి ఇలాంటి ఘటనలను అడ్డుకోవాలి. టీడీపీ నేతలపై పదుల సంఖ్యలో పెట్టిన తప్పుడు కేసులతోపాటు రౌడీషీట్లను బేషరతుగా తొలగించాలని డిమాండ్ చేస్తున్నా. అలా చేయడంవల్ల ప్రజాస్వామ్యం, ప్రాథమిక హక్కులను పరిరక్షించవచ్చు' అని చంద్రబాబు పేర్కొన్నారు.

బలవంతంగా విద్యాసంస్థల బస్సుల తరలింపు

● టీఎన్ఎస్ఎఫ్ నేతల విమర్శ

చిత్తూరు (సెంట్రల్), ఫిబ్రవరి 18: అనంతపురం జిల్లా రాప్తాడులో జరిగిన వైఎస్సార్‌సీపీ సిద్ధం సభకు రూట్ పర్మిట్ లేకుండా ప్రభుత్వ, ప్రైవేటు, విద్యాసంస్థల బస్సులు తరలించడం సరికాదని టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ప్రభుతేజ ఆదివారం ఒక ప్రకటనలో విమర్శించారు. ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల బస్సులు సిద్ధం సభకు తరలించడంతో శనివారం పాఠశాలలకు సెలవులు ప్రకటించారని పేర్కొన్నారు. ఆర్టీసీ బస్సులు లేక పోవడంతో శని, ఆదివారాల్లో ప్రయాణికులు బస్టాండ్‌లో తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చిందన్నారు. ట్రాన్స్‌పోర్టు అధికారుల నిబంధనల మేరకు ప్రైవేటు పాఠశాలల బస్సులు రోజుకు కేవలం 60 నుంచి 80 కిలో మీటర్లు మాత్రం నడపాల్సిఉందని, అలాంటి ఎలాంటి పర్మిట్, ఫిట్‌నెస్ లేకుండా ఏకంగా 600 కిలో మీటర్లు పాఠశాల బస్సులు నడపడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. టీడీపీ అధికారంలోకి వచ్చాకా, తప్పులు చేసిన ప్రతి అధికారికి శిక్ష తప్పదని హెచ్చరించారు.

సద్దికూళ్లపల్లెలో జల్లికట్టు



వెదురుకుప్పం, ఫిబ్రవరి 18: వెదురుకుప్పం మండలం కొమరగుంట పంచాయతీ సద్దికూళ్లపల్లెలో ఆదివారం జల్లికట్టు నిర్వహించారు. కోడెగిత్తల కొమ్ములకు వివిధ రకాల పట్టీలను కట్టి అల్లివైపు వదిలారు. ఈ పట్టీలను సొంతం చేసుకునేందుకు అల్లిలో సిద్ధంగా ఉన్న యువకులు గిత్తలను ఆపే ప్రయత్నం చేశారు. ఆ ప్రయత్నంలో పలువురు గాయపడ్డారు. పట్టీలు దక్కించుకున్న యువకులు కేరింతలు కొట్టారు. జల్లికట్టు నిర్వహణ సందర్భంగా జనం ఈలలు, కేకలు దద్దరిల్లాయి. జల్లికట్టుకు వచ్చిన జనంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.

తిరుపతిలో నేటి నుంచి రెండో విడత శిక్షణ

● జేసీ సహా హాజరుకానున్న 23 మంది అధికారులు

చిత్తూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 18: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల నిర్వహణపై తిరుపతిలో సోమవారం నుంచి 23వ తేదీవరకు ఎంపికచేసిన అధికారులకు రెండో విడత శిక్షణ జరగనుంది. ఇందుకోసం తిరుపతిలోని పద్మావతి యూనివర్సిటీ క్యాంపస్‌లోని తిరుపతి అడ్మిన్ బిల్డింగ్, హ్యూమానిటీస్ సెమినార్ హాల్, సావేరి అతిథిగృహ సెమినార్ హాలును కేంద్రాలుగా ఎంపిక చేశారు. నామినేషన్ల స్వీకరణ, నేరచరిత్రలుంటే వారి వివరాల సేకరణ, నామినేషన్ల భద్రత, పోలింగ్ ఏర్పాట్లు, బ్యాలెట్ పేపర్లు, డిస్ట్రిక్ ఎలక్షన్ మేనేజ్‌మెంట్ ప్లాన్, ఇంటర్నెట్ అప్లికేషన్, వివిధ పోర్టల్స్ వినియోగం, నామినేషన్ల స్వీకరణ సమయంలో అర్హులు, అనర్హుల గుర్తింపు, ఈవీఎం, వీవీప్యాట్, మోడల్ కోడ్, ఎక్స్‌పెండీచర్, ఓట్ల లెక్కింపు- ఫలితాల వెల్లడిపై శిక్షణ ఇస్తారు. ఈ శిక్షణకు జేసీ శ్రీనివాసులుతో పాటు, పలమనేరు, కుప్పం, నగరి ఆర్డీవోలు, చిత్తూరు, పుంగనూరు, నగరి మున్సిపల్ కమిషనర్లు, పుంగనూరు, రొంపిచెర్ల, పులిచెర్ల, చౌడేపల్లి, నగరి, విజయపురం, నిండ్ర, పెనుమూరు, కార్వేటినగరం, గంగాధర నెల్లూరు, పాలసముద్రం, శ్రీరంగరాజపురం, గుడిపాల, ఐరాల, పూతలపట్టు, తవణంపల్లె తహసీల్దార్లు హాజరౌతారు.

50శాతం ఇళ్ల రిజిస్ట్రేషన్లు పూర్తి

చిత్తూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 18: జగనన్న కాలనీల్లో ఇళ్ల రిజిస్ట్రేషన్లు ఆదివారం నాటికి 50శాతం పూర్తయ్యింది. ఆదివారం సెలవు రోజైనా రిజిస్ట్రేషన్లు జరిగాయి. జిల్లావ్యాప్తంగా జగనన్న కాలనీల్లోని 34,924 ఇండ్ల రిజిస్ట్రేషన్లు జరగాల్సివుండగా, ఆదివారం నాటికి 16,297 రిజిస్ట్రేషన్లు పూర్తయ్యాయి. ఇంకా 18,627 ఇళ్ల రిజిస్ట్రేషన్లు జరగాల్సివున్నాయి.

నా పరువుకు భంగం కల్గిస్తున్నారు

ముడా ఛైర్మన్‌పై న్యాయవాది నవీన్ బార్ అసోసియేషన్‌కు ఫిర్యాదు

పుంగనూరు, ఫిబ్రవరి 18: తన పరువు ప్రతిష్టలకు భంగం కలిగిస్తూ తన ఫొటోకు శ్రద్ధాంజలి, దారిదోపిడీలు చేసే దొంగ అంటూ ముడా ఛైర్మన్, న్యాయవాది ఎన్.వెంకటరెడ్డి యాదవ్ సోషియల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారని బార్ అసోసి యేషన్‌కు ఫిర్యాదు చేసినట్లు న్యాయవాది ఎల్.నవీన్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ పుంగనూరుకు చెందిన వెంకటరెడ్డియాదవ్ తనపై తప్పుడు కేసులు పెట్టి ఇబ్బంది పెట్టడంతోపాటు తన పరువ దెబ్బతీసే విధంగా ఫేస్‌బుక్, వాట్సాప్‌లో అసభ్య పదజాలాలు వాడుతూ పోస్టులు పెట్టడం దారుణమన్నారు. మూడేళ్లుగా కోర్టులో న్యాయవాదిగా పనిచేస్తుండగా తనపై కక్షపూరితంగా, భవిష్యత్ నాశనం చేసేవిధంగా ఆయన వ్యవహరిస్తూ వ్యక్తిత్వాన్ని కించపరుస్తున్నారని ఆరోపించారు. తాను పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని, వెంకటరెడ్డియాదవ్ తనపై ఫిర్యాదు చేసిన వెంటనే పోలీసులు కేసులు నమోదు చేసినట్లు వాపోయారు. బార్‌అసోసియేషన్ విచారించి తనకు న్యాయం చేయాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో కారు డ్రైవర్ మృతి

పుంగనూరు రూరల్, ఫిబ్రవరి 18 : పుంగనూరు-మదనపల్లె మార్గంలోని సుగాలిమిట్ట క్రాస్ వద్ద కారు బోల్తాపడి శనివారం రాత్రి డ్రైవర్ ధృవరాజ్ మృతి చెందినట్లు హెడ్‌కానిస్టేబుల్ మహేంద్ర తెలిపారు. ఆయన కథనం మేరకు ... బెంగళూరు సమీపంలోని మహదేవపూర్‌కు చెందిన మునియప్ప కుమారుడు ధృవరాజ్(44) అతని స్నేహితులతో కలసి బోయకొండ గంగమ్మ దర్శనార్థం శనివారం రాత్రి కారులో బయలుదేరారు. దారి తప్పి మదనపల్లె వైపు వెళ్లగా సుగాలిమిట్ట క్రాస్ వద్ద కారు అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో డ్రైవింగ్ చేస్తున్న ధృవరాజ్ అక్కడక్కడే మృతి చెందగా మరో ఇద్దరు గాయపడ్డారు. వీరు చికిత్స నిమిత్తం బెంగళూరులకు వెళ్లినట్లు తెలిపారు.

నేడు కలెక్టరేట్‌లో స్పందన

చిత్తూరు, ఫిబ్రవరి 18: కలెక్టరేట్‌లో సోమవారం స్పందన కార్యక్రమం జరుగుతుందని కలెక్టర్ షన్మోహన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజల నుంచి కలెక్టర్, ఇతర అధికారులు వినతిపత్రాలను స్వీకరిస్తారని తెలియజేశారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

● ఎస్పీ కార్యాలయంలో..

జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం జరుగుతుందని ఎస్పీ జాషువా తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరిస్తామని పేర్కొన్నారు.

సీకే బాబుకు కాంగ్రెస్‌లోకి ఆహ్వానం



సీకే బాబు నివాసంలో ఆయనతో చర్చిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

చిత్తూరు రూరల్, ఫిబ్రవరి 18: చిత్తూరు మాజీ ఎమ్మెల్యే సీకే బాబును కాంగ్రెస్ పార్టీలోకి రావాలని ఆ పార్టీ నేతలు ఆహ్వానించారు. ఆదివారం చిత్తూరులోని ఆయన నివాసంలో కాంగ్రెస్ పార్టీ నేతలు కలిసి ఆయన పార్టీలోకి ఆహ్వానించేందుకు వెళ్లారు. సీకే బాబు కాంగ్రెస్‌లోకి వస్తే జిల్లాలో పార్టీ మరింత బలపడుతుందని నేతలు తెలిపారు. అనంతరం ఆయన్ను సన్మానించారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాంభూపాల్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాబు, జిల్లా అధ్యక్షుడు భాస్కర్, రాష్ట్ర మహిళా నాయకురాలు విక్టోరియా, రాణి, పూర్ణచంద్ర, చందు రాణి, ప్రభాకర్ తదిరులు పాల్గొన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.4.17 కోట్లు

తిరుమల, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.4.17 కోట్లు లభించింది. శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శనివారం లెక్కించి ఆదివారం ఉదయం ప్రకటించింది.శనివారం 71,021 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 25,965 మంది తలనీలాలు సమర్పించారు.





చిత్తూరు ఆర్టీసీ బస్టాండులో బస్సుల కోసం వేచి ఉన్న ప్రయాణికులు - బస్సు ఎక్కేందుకు పోటీపడుతూ..

రెండోరోజూ బస్సుల్లేక..!

జిల్లాలో ప్రయాణికుల ఇబ్బందులు ● గంటల తరబడి బస్టాండ్లలో పడిగాపులు

చిత్తూరు రూరల్, ఫిబ్రవరి 18: అనంతపురం జిల్లా రాప్తాడులో జరిగిన సీఎం సభకు జిల్లాలోని 70 శాతం ఆర్టీసీ బస్సులతో పాటు ప్రైవేటు సర్వీసులను కేటాయించారు. దీంతో శనివారం మొదలైన ప్రయాణికుల కష్టాలు.. ఆదివారమూ కొనసాగాయి. ఆయా బస్టాండ్ల వద్ద బస్సుల్లేక బంద్ వాతావరణం కనిపించింది. ఏ బస్టాప్ చూసినా ప్రయాణికులతో కిక్కిరిసింది. గంటల తరబడి వేచివున్నా బస్సులు రాకపోవడంతో చివరకు ప్రయాణికులు ఆటోలపై ఆధారపడ్డారు. మరికొందరైతే రవాణా వాహనాలు, లారీల్లో ప్రయాణించారు. ఇక, కర్ణాటక, తమిళనాడు ఆర్టీసీ బస్సులు కిక్కిరిశాయి. అప్పుడప్పుడు వచ్చే మన ఆర్టీసీ బస్సులను ఎక్కేందుకు పోటీపడ్డారు.



వన్ టౌన్ పోలీస్ స్టేషన్ వద్ద ఉన్న బస్టాప్ వద్ద బస్సుల కోసం నిరీక్షణ

మూడు గంటలైనా ఒక బస్సూ రాలేదు



బస్సుల్లేక వెలవెలబోతున్న పలమనేరు ఆర్టీసీ బస్టాండు

పలమనేరు: బస్సుల్లేక పలమనేరు బస్టాండు ఖాళీగా కనిపించింది. గంగవరం మండలం కొత్తపల్లికి చెందిన రెడ్డెప్ప రెడ్డి వి.కోటలోని తమ బంధువుల ఇంటికి వెళ్లాలని ఆదివారం ఉదయం 10 గంటలకు పలమనేరు ఆర్టీసీ బస్టాండుకు చేరుకొన్నారు. మధ్యాహ్నం ఒంటి గంట అవుతున్నా ఒక్కబస్సుకూడా రాలేదు. ఎప్పుడు వస్తుందో కూడా ఆర్టీసీ అధికారులు చెప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

సీఎం సభ మా చావుకొచ్చింది

ఎక్కడో అనంతపురం జిల్లాలో సభ జరిగితే చిత్తూరు నుంచి జనాలను తరలించడం ఏంటో అర్థం కావడం లేదు. సీఎం సభ మాలాంటి ప్రయాణికుల చావుకొచ్చింది. చిన్న పిల్లలు, వృద్ధులు తాగునీరు, ఆహారం లేక బస్టాండల్లో ఉంటూ ఇబ్బందులు పడుతున్నారు. ఈ పాపం సీఎందే.

- జగన్, ప్రయాణికుడు

పరీక్షల్లో ఫెయిలవడం.. అమ్మ మందలింపు

● మనస్తాపంతో వ్యవసాయ పాలిటెక్నిక్ విద్యార్థిని ఆత్మహత్య



శశి (ఫైల్ ఫొటో)

తిరుపతి (నేరవిభాగం)/వెదురుకుప్పం, ఫిబ్రవరి 18: పరీక్షల్లో ఫెయిలవడంతో అమ్మ మందలించిందని.. మనస్తాపంతో వ్యవసాయ పాలిటెక్నిక్ విద్యార్థిని ఒకరు ఆత్మహత్య చేసుకున్నారు. తిరుపతి రూరల్ ఎస్ఐ నాగేంద్ర బాబు తెలిపిన ప్రకారం.. చిత్తూరు జిల్లా వెదురుకుప్పం మండలం తిరుమలయ్యపల్లె పంచాయతీ వేణుగోపాలపురానికి చెందిన టి.గోవిందరాజులు, మమత దంపతుల రెండో కుమార్తె టి.శశి(16). ఈమె తిరుపతి ఎస్వీ అగ్రికల్చరల్ కళాశాల హాస్టల్లో ఉంటూ, పాలిటెక్నిక్ మొదటి సంవత్సరం చదువుతోంది. ఇటీవల మొదటి సెమిస్టర్ పరీక్షలు రాసి సెలవుల్లో ఇంటికి వెళ్లింది. వారం కిందట వచ్చిన ఫలితాల్లో ఆమె ఫెయిలవడంతో తల్లి మందలించింది. మూడ్రోజుల కిందట హాస్టల్‌కు వచ్చిన ఆమె.. శనివారం రాత్రి ఇంటికి ఫోన్‌చేసి చాలాసేపు మాట్లాడింది. రాత్రి 12 గంటల వరకు చదువుకుని, సహ విద్యార్థినులతో కలిసి నిద్రకు ఉపక్రమించింది. ఆదివారం సెలవు కావడంతో అందరూ ఉదయం ఎనిమిది గంటలకు నిద్రలేచారు. అప్పటికే సీలింగ్ ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకున్న శశి కనిపించింది. సమాచారం అందుకున్న రూరల్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు. తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. 'ఇప్పటి వరకు తెలుగు మీడియంలో చదివాను. ఒక్కసారిగా ఇంగ్లిష్‌లో చదవాల్సి రావడం కష్టంగా ఉంది. అర్థం చేసుకోలేకపోతున్నాను. అందుకే పరీక్షల్లో కూడా ఫెయిల్ అయ్యాను. అమ్మ ఎప్పుడూ తిడుతూనే ఉంటారు. నావల్లనే కదా మీ అందరికీ అవమానం. నేనే వెళ్లిపోతా. మీరు సంతోషంగా ఉండండి' అంటూ ఆమె రాసిన సూసైడ్ నోట్ పోలీసులకు లభించింది.

అత్త చీరతో..: ఉరేసుకోవడానికి వాడిన చీర శశి అత్తదని పోలీసులు గుర్తించారు. ఊరినుంచి వచ్చేటప్పుడే ఈ చీరను తెచ్చుకున్నట్లు భావిస్తున్నారు. కాగా, కొన్నేళ్ల కిందట ఇద్దరు కుమార్తెలతో పుట్టింటికి చేరిన మమత.. ఇద్దరు పిల్లలను చదివిస్తున్నారు. రెండో కుమార్తె శశి ఆత్మహత్య చేసుకోవడంతో ఆమెతో పాటు బంధువులు రోదిస్తున్నారు.

25న గ్రూప్-2 ప్రిలిమ్స్

20 పరీక్ష కేంద్రాల ఎంపిక

చిత్తూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 18: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) ఆధ్వర్యంలో గ్రూప్-2 ప్రిలిమ్స్‌కు సంబంధించి ఈ నెల 25న ఆబ్జెక్టివ్ టైపులో స్క్రీనింగ్ టెస్ట్ పరీక్షలు జరుగుతాయని జిల్లా అధికార ప్రతినిధి తెలిపారు. ఇందుకోసం చిత్తూరు, బంగారుపాళ్యం, పలమనేరు, పూతలపట్టు ప్రాంతాల్లో 20 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు, పరీక్షలకు 9411 మంది అభ్యర్థులు హాజరౌతారని వివరించారు. జిల్లా రెవిన్యూ అధికారి పుల్లయ్య ఈ పరీక్షలకు నోడల్ ఆఫీసర్‌గా వ్యవహరిస్తారని పేర్కొన్నారు. 25న ఉదయం 10.30 గంటల నుంచి 1 గంట వరకు జరిగే పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు.

పంట పొలాలపై ఏనుగుల దాడులు



గూబలవారిపల్లెలో వరి పంటను తొక్కేసిన ఏనుగులు

ఐరాల, ఫిబ్రవరి 18: ఐరాల మండలం శివారు ప్రాంతమైన గూబలవారిపల్లెలో శనివారం రాత్రి ఏనుగులు పొలాలపై దాడులు చేశాయి. మామిడి, వరి, కొబ్బరి తోటలను తొక్కి నాశనం చేశాయి. చంద్రయ్యకు చెందిన మామిడి, కొబ్బరి చెట్లను విరిచేశాయి. అలాగే గుర్రప్పకు చెందిన కొబ్బరి చెట్లతో పాటు కౌలు రైతులు కిరణ్, హనుమంతుకు చెందిన మామిడి, వరి పంటలను నాశనం చేశాయి. అనంతరం ఏనుగులు అక్కడి నుంచి కల్లూరు రిజర్వ్ ఫారెస్టుకు వెళ్లి పోయినట్లు సమాచారం. దీనిపై ఎఫ్‌బీవో లావణ్య మాట్లాడుతూ రైతులకు త్వరలో నష్ట పరిహారాన్ని అటవీశాఖ ద్వారా అందిస్తామన్నారు.

అరాచకాలు చేస్తున్న మంత్రి పెద్దిరెడ్డిపై రౌడీషీట్ తెరవాలి

బీసీవై పార్టీ అధినేత రామచంద్రయాదవ్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీసీవై పార్టీ అధినేత రామచంద్రయాదవ్

పుంగనూరు, ఫిబ్రవరి 18: ప్రశాంతమైన పుంగనూరులో అరాచకాలు, దోపిడీ, దౌర్జన్యాలకు పాల్పడుతున్న మంత్రి పెద్దిరెడ్డి రామ చంద్రారెడ్డిపై మొదటగా పోలీసులు రౌడీషీట్ తెరవాలని బీసీవై పార్టీ అధ్యక్షుడు బి. రామ చంద్రయాదవ్ డిమాండు చేశారు. పుంగనూరులో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రజాబలం లేకనే మంత్రి పెద్దిరెడ్డి అధికారాన్ని అడ్డంపెట్టుకుని నీచ రాజకీయాలు చేస్తున్నారన్నారు. ప్రశ్నించే వారిపై తప్పుడు కేసులు పెట్టిస్తున్నారని మండిపడ్డారు. బీసీవైపీ కార్యకర్తలకు కిట్ ఇవ్వడానికి గోడగడియారాలు తెప్పిస్తే.. ఎన్నికల కోడ్ రాకముందే నియమావళి ఉల్లంఘించారంటూ పోలీసులు సీజ్ చేశారన్నారు. వీటిలో కర్ణాటక మద్యంబాటిళ్లను పోలీసులు పెట్టి తప్పుడు కేసు పెట్టారన్నారు. సెర్చ్‌వారెంట్ ఇచ్చిన డీఎస్పీపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయగా విచారణకు ఆదేశించినట్లు తెలిపారు. నియోజకవర్గంలో అక్రమాలకు పాల్పడిన ప్రతి అధికారి పైనా ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసి వారిని ఎన్నికల్లో పుంగనూరులో లేకుండా న్యాయపోరాటం చేస్తామన్నారు. మంత్రి ప్రోద్బలంతో తనపై 47 తప్పుడు కేసులు పెట్టాడానికి సీఐలు రాఘవరెడ్డి, కృష్ణారెడ్డి, గంగిరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, డీఎస్పీలు సుధాకర్‌రెడ్డి, రాజగోపాల్‌రెడ్డి, ఎస్పీ రిషాంత్‌రెడ్డి కారణమన్నారు. తనపై పెట్టిన కేసులన్నీ నిజాలైతే మంత్రి పెద్దిరెడ్డి ఆయన నమ్మే అయ్యప్పస్వామిపై ప్రమాణం చేస్తారా అని అన్నారు. ప్రస్తుతం నియోజకవర్గంలో దాదాపు 50మంది ప్రతిపక్ష నాయకులు, కార్యకర్తలపై రౌడీషీటర్లుగా కేసులు నమోదు చేయించడం దారుణమన్నారు. సమావేశంలో నాయకులు సాంబమూర్తి, హరినాథరెడ్డి, హరియాదవ్, కిరణ్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.



తుమ్మలగుంట చెరువులో జరిగిన నిర్మాణాలు

తుమ్మలగుంట చెరువులో అనధికారిక నిర్మాణాలపై కొరడా?

● తొలగించాల్సిందేనన్న ఎన్జీటీ

తిరుపతి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం తుమ్మలగుంట చెరువులో అనధికారిక నిర్మాణాలపై నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్జీటీ) కొరడా ఝుళిపించింది. చెరువు స్వరూపాన్ని మార్చిన వారిపై చర్యలు తీసుకొని, నిర్మాణాలను తొలగించాలని సూచించినట్టు తెలుస్తోంది. దీనిపై ఏప్రిల్ 23వ తేదీలోపు నివేదిక ఇవ్వాలని కాలుష్య నియంత్రణ మండలితోపాటు కలెక్టరును ఆదేశించినట్టు సమాచారం. దీంతో తుడా అధికారులు నివేదిక సమర్పించడానికి తర్జనభర్జన పడుతున్నట్టు తెలుస్తోంది. గత ఏడాది సెప్టెంబరులో తుమ్మలగుంట చెరువులో ఏమి జరుగుతుందో వివరణ ఇవ్వాలని కలెక్టర్, తుడా, నీటిపారుదల శాఖను ఎన్జీటీ ఆదేశించింది. తుమ్మలగుంట చెరువు అన్యాక్రాంతమవుతోందని పలువురు స్థానికులు చేసిన ఫిర్యాదు మేరకు ఎన్జీటీ గతంలోనే సీరియస్ అయ్యింది. చెరువు స్టేటస్‌పై నివేదిక పంపాలని ఆదేశించింది. గత ఏడాది అక్టోబరులో తుడా నివేదికలు పంపినట్టు సమాచారం. అయితే వాటికి ఎన్జీటీ సంతృప్తి చెందనట్టు తెలుస్తోంది.

పూర్వాపరాలిలా..

తిరుపతి రూరల్ మండలం సర్వేనెంబరు 60లో 82 ఎకరాల విస్తీర్ణంలో తుమ్మలగుంట చెరువు ఉంది. దీనికి ఎగుదాల ఉండే పేరూరు చెరువు, స్వర్ణముఖి నుంచి కాలువలు ద్వారా తుమ్మలగుంట చెరువుకు నీళ్లు వచ్చేవి. ఈ నీటితో తుమ్మలగుంట 180 ఎకరాల ఆయకట్టుతో పొలాలు పచ్చగా, గ్రామం పుష్కలంగా ఉండేది. భూగర్భ జలాలు బాగా అందుబాటులో ఉండేవి. ఇదంతా గతం. క్రమేపీ ఈ చెరువుకు నీళ్లు తెచ్చే కాలువలు అంతర్ధానమయ్యాయి. చెరువు ఎండిపోయింది. తుమ్మలగుంట చెరువుకు రెండు నీటి సరఫరా కాలువలు ఉండేవి. స్వర్ణముఖి నుంచి పాత కాల్వ మీదుగా ఒకటి, పేరూరు చెరువు నుంచి అక్కగార్ల కశం కాలువ నుంచి మరో కాలువ తుమ్మలగుంటకు అనుసంధానమై ఉండేవి. చెరువులోకి నీళ్లొచ్చాయంటే రెండు కార్లు గట్టిగా పండించుకోవచ్చన్న ధీమా ఇక్కడ రైతులకుండేది. కాలక్రమంలో ఈ రెండు కాలువలు కబ్జాచేసి.. ఇళ్లు కట్టేశారు. దీంతో చెరువుకు నీరు చేరే అవకాశం లేకుండా పోయింది. ఆ చెరువు ఇప్పుడు కుర్రకారుకు సువిశాల ఆటస్థలంగా మారిపోయింది. 82 ఎకరాల చెరువులో 22 ఎకరాలను మునకపట్టాల కింద రైతులకు రెవెన్యూ అధికారులు అందించారు. తక్కిన 60 ఎకరాల్లో తుమ్మలగుంట స్థానికుడైన చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి గతంలో తుడా ఛైర్మన్‌గా ఉన్నప్పుడు చెరువును సుందరీకరణ చేయాలని భావించారు. ఈక్రమంలో చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్ వేశారు. బోటింగ్ ఏర్పాటు చేయాలని చెరువును కొంత భాగం తవ్వారు. అంతేగాక జిల్లా క్రికెట్ అసోసియేషన్‌కు కొంత కేటాయించారు. నెట్ ప్రాక్టీసింగ్‌కు వినియోగిస్తున్నారు. ఏడాదికి ఒకసారి ఇక్కడ గ్రామీణ క్రికెట్ పోటీలు పెడుతుంటారు. ఈ నేపథ్యంలో చెరువు తన స్వరూపాన్ని కోల్పోయిందంటూ ఎన్జీటీకి ఫిర్యాదులు అందాయి. ఈక్రమంలో ఎన్జీటీ ఆగ్రహంపై ఎలాంటి నిర్ణయం తీసుకోనున్నారో వేచిచూడాలి.

ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై దాడి హేయమైన చర్య



ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై దాడిని ఖండిస్తున్న టీడీపీ నాయకులు

పెద్దపంజాణి, ఫిబ్రవరి 18: ముఖ్యమంత్రి సభలో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ కృష్ణపై దాడి చేయడం హేయమైన చర్యని మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి చలపతి విమర్శించారు. ఆదివారం చళమంగళం పంచాయతీలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహిస్తుండగా ప్రచార మాధ్యమాల ద్వారా విషయం తెలుసుకున్న మాలమహానాడు జిల్లా నాయకులు సుబ్రమణ్యం, లింగాపురం సర్పంచ్ రుద్రమూర్తినాయుడు విలేకరుల సమావేశం నిర్వహించి ఖండించారు. రాష్ట్రంలో తనకు అడ్డు వచ్చిన ప్రతి ఒక్కరిని వేధించడం, దాడులు చేయడం, కేసులు నమోదు చేయడం వైసీపీ ప్రభుత్వానికి అలవాటుగా మారిందని దుయ్యబట్టారు. ముఖ్యమంత్రి సమావేశంలోనే దాడులు నిర్వహిస్తుంటే సామాన్యులకు రక్షణ ఎక్కడుందన్నారు. దాడికి పాల్పడ్డవారిని అరెస్టు చేయాలని డిమాండు చేశారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు మనోహర్, బావాజాన్, ఫయాజ్ తదితరులు ఉన్నారు.

తెలుగు భాష పరిరక్షణను ఎన్నికల ప్రణాళికల్లో పేర్కొనాలి



సన్మానం అందుకున్న కవులు, రచయితలు

గంగవరం, ఫిబ్రవరి 18 : మాతృభాష తెలుగును ఏవిధంగా పరిరక్షిస్తారన్న అంశాన్ని రాజకీయ పార్టీల నాయకులు ఎన్నికల ప్రణాళికల్లో పొందుపరచేలా చర్యలు తీసుకోవాలని తెలుగుసాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షులు తులసీనాథం నాయుడు డిమాండ్ చేశారు. అంతర్జాతీయ మాతృభాష దినోత్సవాన్ని పురస్కరించుకొని ముందస్తుగా ఆదివారం స్థానిక కళామందిరంలో 'మాతృభాష పరిరక్షణ' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు పాఠశాల స్థాయి నుంచే మాతృభాషలో బోధన జరిగినప్పుడే తెలుగు భాషపై పట్టు సాధించడంతోపాటు విద్యార్థుల్లో వ్యక్తిత్వవికాసం పెంపొందిస్తుందనడంలో సందేహం లేదన్నారు. తెలుగుభాష రక్షణ అనేది ఇంటినుంచే మొదలుపెట్టి, నామఫలకాలు తెలుగులో ఉండేలా చూడాలన్నారు. మాతృభాషను పూర్తిస్థాయిలో నేర్చుకున్నప్పుడే మిగిలిన భాషలపై పట్టు సాధించడానికి వీలవుతుందన్నారు. అనంతరం జాతీయ స్థాయి కవితల పోటీల్లో విశేష ప్రతిభ కనబరచిన 40మంది రచయితలు, కవులను పూలమాలలు, దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి పుష్ప, మాధవరెడ్డి, జొన్నవిత్తుల శ్రీరామచంద్రమూర్తి, డాక్టర్ సి.నారాయణస్వామి, మురళీనాథ్ విమల, వాణి, నవీన్, బాబు, విజయ్, సౌమిత, మొహిద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష మెజారిటీ సాధనలో యువత ముందుండాలి



సమావేశంలో మాట్లాడుతున్న మురళి

కుప్పం రూరల్, ఫిబ్రవరి 18: చంద్రబాబుకు లక్ష మెజారిటీ సాధించడంలో యువత ముందుండాలని టీడీపీ కుప్పం నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు మురళి పిలుపునిచ్చారు. మండలంలోని బ్రహ్మదేవరచేన్లు గ్రామంలో ఆదివారం ఆయన ఆధ్వర్యంలో బెంగళూరు టీడీపీ ఫోరం ప్రతినిధులు గ్రామస్థులతో సమావేశమయ్యారు. పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అధిష్ఠానం ఆదేశాల మేరకు పనిచేయాలి



బీజేపీ సమావేశంలో మాట్లాడుతున్న శివశంకర్

కుప్పం, ఫిబ్రవరి 18: రాబోయే ఎన్నికల్లో పొత్తులైనా, లేదా సొంతంగా అయినా సరే అధిష్ఠానం నిర్దేశించిన ప్రకారం పనిచేసుకుపోవాలని బీజేపీ కుప్పం నియోజకవర్గ కన్వీనర్ శివశంకర్ అన్నారు. కుప్పంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం బీజేపీ నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 22వ తేదీన నెల్లూరులో జరిగే బూత్ స్థాయి పబ్లిక్ సమావేశానికి నియోజకవర్గంలో ఒక బూత్‌కు ముగ్గురు చొప్పున హాజరు కావాలని కోరారు. ఈ సమావేశానికి మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి శివరాజ్ చౌహాన్ ముఖ్యఅతిథిగా విచ్చేస్తారని చెప్పారు. అలాగే ఈనెల 23వ తేదీనుంచి ప్రారంభించి 9 రోజులపాటు ప్రజాపోరు అనే కార్యక్రమాన్ని ప్రతి గ్రామంలో నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాలుగు మండలాల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆటో బోల్తా : ఆరుగురికి తీవ్రగాయాలు




బోల్తాపడ్డ ఆటో, గాయపడిన వారికి చికిత్స అందిస్తున్న వైద్య సిబ్బంది

చౌడేపల్లె, ఫిబ్రవరి18: ఆటో అదుపు తప్పి బోల్తాపడడంతో ఆరుగురికి తీవ్రగాయాలైన ఘటన చౌడేపల్లె మండలంలో ఆదివారం జరిగింది. బాధితుల కథనం మేరకు .. దాదేపల్లె సమీపంలోని ఓ రైతు పొలంలో చింతకాయలు కోయడానికి పెద్దకంపల్లెకు చెందిన దినసరి కూలీలు ఐదుగురు దాదేపల్లెకు చెందిన ముసాయిద్(25) ఆటోలో బయలుదేరారు. ఈ క్రమంలో పెద్దకంపల్లె ఊరు ఆటో దాటగానే అదుపుతప్పి బోల్తాపడింది. ఈప్రమాదంలో డ్రైవర్‌తో సహా కూలీలు నరసింహులు, శంకరమ్మ, లక్ష్మమ్మ, గుర్రమ్మ, నారాయణమ్మ లు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడ్డవారిని 108 వాహనంలో చౌడేపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించి, చికిత్సలు కల్పించి, మెరుగైన చికిత్సల కోసం మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

మామిడి తోటకు నిప్పు



పుంగనూరు రూరల్, ఫిబ్రవరి18: మామిడి తోటకు గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో దాదాపు రూ. 20వేలు విలువ చేస్తే ఆస్తి నష్టం జరిగినట్లు అగ్నిమాపక అధికారి సుబ్బరాజు తెలిపారు. ఆదివారం పుంగనూరు మండలంలోని ఇటుకనెల్లూరుకు చెందిన హనుమంతప్పకు చెందిన మామిడితోట, నీలగిరిచెట్లకు నిప్పు పెట్టినట్లు సమాచారం మేరకు సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

ఎల్లుండి పుంగనూరు మండల సమావేశం

పుంగనూరు రూరల్ : ఈనెల 21న పుంగనూరు మండల సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీపీ భాస్కర్‌రెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ సమావేశంలో మండల సమస్యలు, అభివృద్ధిపై చర్చిస్తామన్నారు. సమావేశానికి సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు తప్పక హాజరు కావాలని కోరారు.

నాగ దేవతల విగ్రహ ప్రతిష్ఠ




నాగ దేవతల విగ్రహాలకు పూజలు, అన్నదాన కార్యక్రమం

రామకుప్పం, ఫిబ్రవరి 18: మండలంలోని కంబాలదేవులపల్లెలో ఆదివారం నాగదేవతల విగ్రహ ప్రతిష్ఠ ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన విజయ్‌కుమార్‌రెడ్డి, కల్పన దంపతులు గ్రామస్థుల సహకారంతో కార్యక్రమాన్ని నిర్వహించారు. గణపతి హోమం, వాస్తు పూజ కుంభాభిషేకం గోపూజ నిర్వహించారు. బెంగుళూరుకు చెందిన జగదీష్‌స్వామి ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. అనంతరం మహిళలకు పసుపు, కుంకుమ, సారె పంపిణీ చేశారు. శ్రీలక్ష్మీనారాయణ అవతారమైన అశ్వర్థ వృక్షాలు సమూహంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు.

యువజనాగ్రహంతో ఫ్యాన్ రెక్కలు ముక్కలు



యువతలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్

రామకుప్పం, ఫిబ్రవరి 18: వైసీపీ ప్రభుత్వం యువతను తీవ్రంగా మోసం చేసిందని, యువజన ఆగ్రహంతో ఫ్యాను రెక్కలు ముక్కలు ముక్కలుగా విరిగిపోతాయని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ సురేష్‌బాబు పేర్కొన్నారు. ఆదివారం రామకుప్పంలో ఏర్పాటు చేసిన కంచర్ల శ్రీకాంత్ యువతతో ముఖాముఖి కార్యక్రమానికి వేలాదిగా యువత తరలివచ్చారు. వారు మాట్లాడుతూ...వైసీపీ అధినేత జగన్ ఎన్నికలకు ముందు ఏటాజాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని, మెగా డీఎస్సీ నిర్వహిస్తామని యువతను మోసం చేసారన్నారు. కార్పొరేషన్ ద్వారా యువతకు అందాల్సిన స్వయం ఉపాధి సబ్సిడీ రుణాల ఊసేలేకుండా పోయిందన్నారు. మరో సారి అధికారం కోసం అబద్ధాల హామీలతో యువతను మోసం చేసేందుకు వైసీపీ పెద్దలు సిద్ధమౌతున్నారని అన్నారు. యువత ఎట్టి పరిస్థితుల్లో వారి కల్లి బొల్లి హామీలను నమ్మే స్థితిలో లేదన్నారు. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పన టీడీపీతోనే సాధ్యమని అందరూ నమ్ముతున్నారని తెలిపారు. కార్యక్రమంలో తెలుగు యువత అధ్యక్ష, కార్యదర్శులు విశ్వనాథం, వెంకటాచలం, ప్రధాన కార్యదర్శులు వెంకటేష్, శంకర్, చలం, నేతలు సతీష్, అవినాష్, మంజునాథ్, విజయ్‌కుమార్, జ్ఞానశేఖర్, వెంకటరమణ, ఆదిల్, విజయ్‌కుమార్, బాబు సాయబ్, మురళి తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ ప్రభుత్వ పతనం ఖాయం : అమర్



పలమనేరు లక్ష్మీనగర్ కాలనీలో పర్యటిస్తున్న అమరనాథరెడ్డి

పలమనేరు, ఫిబ్రవరి18 : రానున్న ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వ పతనం ఖాయమని మాజీ మంత్రి అమరనాథరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఇంటింటి తెలుగుదేశం కార్యక్రమంలో భాగంగా పలమనేరు మున్సిపాలిటీ లక్ష్మీనగర్‌కాలనీలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ నాలుగున్నర ఏళ్లలో జగన్ తీసుకొన్న నిర్ణయాలు, వైసీపీ నేతల దౌర్జన్యాలు, అక్రమాలతో ప్రజలు పూర్తిగా విసిగి పోయారన్నారు. అన్నివర్గాల్లో జగన్ ప్రభుత్వంపై పూర్తి అసంతృప్తి నెలకొందని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేనతో కూడిన ప్రభుత్వం ఏర్పడడం ఖాయమని ఆయన స్పష్టం చేశారు. అనంతరం ఆర్కే స్ట్రీట్, లక్ష్మీనగర్, కేవీఎస్ స్ట్రీట్, మసీదువీధి, ఓఎల్ఎల్ యూపీ స్కూల్ క్రాస్, మార్కెట్‌యార్డు ప్రాంతాల్లో పర్యటించారు. కార్యక్రమంలో నాయకులు ఆర్బీసీ కుట్టి, గిరిబాబు, చాంద్‌భాషా, సుబ్రమణ్యంగౌడు, ఖాజాపీర్, నాగరాజు, బాబాజాన్, హనీఫ్, లోకేష్‌ఆచారి, షరీష్ షకీల్, ప్రేమ్, గౌస్, యూసఫ్, పర్వీన్, జనసేన నాయకులు దిలీఫ్, చైతన్య, హరీష్, నాగరాజు, రమేష్ పాల్గొన్నారు.

రాంనగర్ కాలనీలో పారిశుధ్య లోపం




కాల్వల్లో నిలచిన మురుగునీరు, డిగ్రీ కాలేజీ వెనక కాలనీలో చెత్తాచెదారం

పుంగనూరు, ఫిబ్రవరి18: పట్టణ శివారు ప్రాంతమైన రాంనగర్, ప్రభుత్వ డిగ్రీకాలేజీ వెనక వైపు పారిశుధ్యం లోపించి ప్రజలు రోగాల బారిన పడుతున్నట్లు స్థానికులు ఆరోపించారు. కాలనీవాసులు మాట్లాడుతూ నెలలుతరబడి కాల్వలు శుభ్రం చేయకపోవడంతో అంటురోగాలు ప్రబలుతున్నట్లు తెలిపారు. కాల్వలో చెత్త నిల్వ వల్ల దోమలు పెరిగి జ్వరాలు వ్యాప్తి చెందుతున్నట్లు తెలిపారు. స్థానిక ప్రజాప్రతినిధులు, సచివాలయ సిబ్బందికి ఫిర్యాదు చేసినా ఫలితం లేదన్నారు. మున్సిపల్ అధికారులు కాల్వలను శుభ్రం చేసి నిల్వ ఉన్న చెత్తను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

రెండో రోజు తప్పని ప్రయాణికుల తిప్పలు



ఆర్టీసీ బస్టాండులో వేచివున్న ప్రయాణికులు

పలమనేరు, ఫిబ్రవరి18 : ముఖ్యమంత్రి జగన్ పుణ్యమా అని పలమనేరులో రెండోరోజు ఆదివారం కూడా ప్రయాణికులకు తిప్పలు తప్పలేదు. ఆదివారం ముఖ్యమంత్రి జగన్ అనంతపురం జిల్లా రాప్తాడులో నిర్వహించే సభకోసం జన సమీకరణకు ఆర్టీసీ అధికారులు పలమనేరు డిపోనుంచి 35పైగా సర్వీసులను రద్దుచేసి బస్సులను రాప్తాడుకు పంపారు. దీంతో కేవలం డిపోలో ఉన్న 20కి లోపు బస్సులు ఎప్పుడు వస్తాయో, ఎక్కడికి వెళ్తాయో కూడా తెలియక ఆదివారం ప్రయాణికులు బస్టాండులో పడిగాపులు పడ్డారు. కొందరు ప్లాట్‌ఫారంలపై వేసిన కుర్చీల్లో కూర్చొని కునుకులోకి జారుకొన్నారు.

ప్రయాణికుడు రియాజ్ : తాను వి.కోటకు వెళ్లాలని బస్టాండుకు వచ్చి రెండున్నర గంటలుగా బస్సులకోసం వేచి ఉన్నానని వి.కోటకు చెందిన ప్రయాణికుడు రియాజ్ తెలిపారు. కనీసం గంటకు ఒక్క బస్సుకూడా లేకపోతే ఎలా అని, పలమనేరు-కుప్పం మార్గంలో ఉన్న వికోట మీదుగా ప్రతిరోజు లెక్కలేనన్ని బస్సులు నడిచేవని ఈరోజు మాత్రం రెండున్నర గంటలు వేచి ఉన్నా ఒక్క బస్సుకూడా రాలేదన్నారు.

చెరకు పంట దగ్ధం

వెదురుకుప్పం, ఫిబ్రవరి 18: వెదురుకుప్పం మండలం తిరుమలయ్యపల్లె పంచాయతీ బాలుపల్లెకు చెందిన ఎం.జగన్నాథరెడ్డి, ఎం.నాగిరెడ్డిలకు చెందిన చెరకు పంట ఆదివారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా కాలిపోయిందని రైతులు తెలిపారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.లక్ష నష్టం జరిగిందని, ప్రభుత్వపరంగా ఆదుకోవాలని కోరారు.

నేడు స్పందన

చిత్తూరు, ఫిబ్రవరి 18: చిత్తూరు నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం జరుగు తుందని కమిషనర్ అరుణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం వరకు ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరిస్తామని తెలిపారు. అదేవిధంగా మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అన్ని సచివాలయాల్లో ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరిస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఏఆర్ఎస్ పార్టీ అన్నిస్థానాల్లో పోటీ చేస్తుంది

చిత్తూరు రూరల్, ఫిబ్రవరి 18: రానున్న ఎన్నికల్లో ఏఆర్ఎస్ పార్టీ అన్ని స్థానాల్లో పోటీ చేస్తుందని ఆ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు కోటేశ్వరరావు స్పష్టం చేశారు. ఆ పార్టీ చేపట్టిన ప్రజా ఎదుగుదల యాత్ర ఆదివారం చిత్తూరులోని మురకంబట్టుకు చేరుకుంది. అక్కడ విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పేద, బడుగు, బలహీనవర్గాల అభివృద్ధిని కాంక్షించి గత ఏడాది పార్టీని స్థాపించినట్లు తెలిపారు. ఏఆర్ఎస్ పార్టీ మ్యానిఫెస్టోను ప్రజలకు వివరిస్తున్నట్లు తెలిపారు. రాజధానిలో ప్రతి డ్వాక్రా గ్రూపునకు వెయ్యి గజాల స్థలాన్ని కేటాయిస్తామన్నారు. పార్టీ ఉపాధ్యక్షుడు పద్మ, మైనారిటీ నాయకులు భాష పఠాన్ తదితరులు పాల్గొన్నారు.

కాణిపాకంలో మద్వాచార్యుల జయంతి

ఐరాల (కాణిపాకం), ఫిబ్రవరి 18: కాణిపాకంలో ఆదివారం మద్వాచార్యులు జయంతిని అర్చకులు, పండితులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అలంకార మండపంలో మద్వాచార్యుల చిత్రపటాన్ని ఉంచి వివిధ పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఈవో వెంకటేశు, సూపరింటెండెంట్ కోదండపాణి, ఆలయ ఇన్‌స్పెక్టర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

బలిజ సంఘం అధ్యక్షుడిగా రామదాసు

చిత్తూరు, ఫిబ్రవరి 18: చిత్తూరు నగర బలిజ సంఘం అధ్యక్షుడిగా ఓఎం రామదాసు ఎన్నికయ్యారు. నగర బలిజ సంఘం సమావేశం ఆదివారం ఆ సంఘ కార్యాలయంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు హాజరయ్యారు. ఈ సందర్భంగా బలిజ సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా రామదాసు, సెక్రటరీగా భవాని రెడ్డెప్ప, కోశాధికారిగా పూల చందు, ఉపాధ్యక్షులుగా నందగోపాల్, కిశోర్, విశ్వనాథ్, కోలా కిరణ్, చక్రి, నరసింహ, హరిప్రసాద్‌తో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఏఎస్ మనోహర్, మాజీ మేయర్ కఠారి హేమలత, సంఘ నేతలు డీకేఏ ద్రినారాయణ, కాజూరు బాలాజీ పాల్గొన్నారు.

నేడు కంటి వైద్యశిబిరం

గంగాధరనెల్లూరు, ఫిబ్రవరి 18: మండలంలోని తూగుండ్రం దళితవాడ చర్చి వద్ద సోమవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు ఉచిత కంటి వైద్యశిబిరం జరుగుతుందని సీఎస్ఐ చర్చి పాస్టర్ దేవేంద్రన్, సభామనేగర్ జీవరత్నం ఒక ప్రకటనలో తెలిపారు. చెన్నైకి చెందిన ఎం.ఎన్.కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో తూగుండ్రం సీఎస్ఐ చర్చి సహకారంతో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నందివాహనంపై ఊరేగిన కాశీవిశ్వేశ్వరుడు



పలమనేరు, ఫిబ్రవరి18 : పలమనేరులోని కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం స్వామికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు. ఆదివారం సాయంత్రం స్వామి వారిని అధికార నంది వాహనంపై ఊరేగించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామికి మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమాలకు కాంట్రాక్టర్ జయశంకర్, ఫర్టిలైజర్స్ దుకాణ యజమాని గంటే శివశంకర్, రాజామెడికల్స్ యజమాని ఎస్. రాజప్పశెట్టి, లేట్ చిన్నస్వామిశెట్టి అండ్ సన్స్ ఉభయదారులుగా వ్యవహరించారు.

బోయకొండ గంగమ్మకు పూజలు



చౌడేపల్లె,ఫిబ్రవరి 18: ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ ఆదివారం గంగమ్మ నామస్మరణతో మార్మోగింది. ఉదయం అర్చకులు ఆలయాన్ని శుద్ధి చేసి, అమ్మవారికి ప్రీతికరమైన వేపాకు తోరణాలతో ఆలయాన్ని అలంకరించారు. అమ్మవారికి పంచామృతాభిషేకాలు, అర్చనలు చేసి, స్వర్ణాభరణాలతో, పూలతో అలంకరించి, ధూప దీప నైవేద్యాలు సమర్పించి భక్తులకు దర్శనం కల్పించారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచియే కాకా తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు అందుకున్నారు. భక్తుల ఏర్పాట్లను ఆలయ ఈవో చంద్రమౌళిలు పర్యవేక్షించారు.

బీఎస్పీ ఎమ్మెల్యే అభ్యర్థిగా గణేశ్



సమావేశంలో మాట్లాడుతున్న బీఎస్పీ నాయకులు

కుప్పం, ఫిబ్రవరి 18: బహుజన సమాజ్ పార్టీ తరఫున ఎమ్మెల్యే అభ్యర్థిగా కుప్పంనుంచి గణేశ్‌ను నిలబెడుతున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పరంజ్యోతి తెలిపారు. కుప్పంలోని అంబేడ్కర్ కమిటీ హాలులో ఆదివారం బీఎస్పీ నియోజకవర్గ స్థాయి సమావేశం జరిగింది. ఎన్నికల ప్రచార పోస్టర్‌ను ఈ సమావేశంలో విడుదల చేశారు. బీసీలకు, బడుగు బలహీన వర్గాలకు రాజ్యాధికారం దక్కాలంటే బీఎస్పీకి ఓటేసి గెలిపించుకోవాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో బీఎస్పీ జోనల్ కోఆర్డినేటర్ విజయ్‌కుమార్, నియోజకవర్గ అధ్యక్షుడు గణేశ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కంటి ఆపరేషన్లకు 65 మంది ఎంపిక



కుప్పం, ఫిబ్రవరి 18: సాయిమాతా సేవాట్రస్టు ఆధ్వర్యంలో, బెంగళూరు శారద కంటి ఆసుపత్రి సౌజన్యంతో ఆదివారం ఉచిత కంటి పరీక్ష శిబిరం నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో జరిగిన ఈ శిబిరంలో 180 మందికి కంటి పరీక్షలు జరిపారు. వీరిలో 68 మందిని కంటి శస్త్ర చికిత్సలకోసం ఎంపిక చేసినట్లు ట్రస్టు అధ్యక్షుడు జగదీశ్‌బాబు తెలిపారు. ఎంపిక చేసిన వారికి బెంగళూరులోని శారద కంటి ఆసుపత్రిలో ఉచితంగా ఆపరేషన్లు చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైద్య బృందం పాల్గొంది.

'చిట్టిప్రేమ' చిత్రానికి అవార్డు



కల్లూరు, ఫిబ్రవరి18: పులిచెర్ల మండలం దిగువ పోకలవారిపల్లి సమీపంలోని ఎంజే ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ మూడవ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు రామ్‌చరణ్, చాణిక్యలు చిట్టిప్రేమ పేరిట యూట్యూబ్ చిత్రం నిర్మించారు. రామ్‌చరణ్ దర్శక, నిర్మాతగా పనిచేశాడు. చాణిక్య హీరోగా, తిరుపతికి చెందిన జోత్స్న హీరోయిన్‌గా నటించారు. ఈ చిత్రాన్ని 2023 డిసెంబర్ 16వ తేదీన యూట్యూబ్‌లో రిలీజ్ చేశారు. ఇప్పటివరకు 16వేలకు పైగా వీక్షించారని రామ్‌చరణ్ తెలిపారు. ఈనెల 17వ తేదీన హైదరాబాదు మాదాపూర్‌లోని టీ-హబ్‌లో కళారాజ్ మీడియా ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో తెలుగు షార్ట్‌ఫిల్మ్ అవార్డు(టీఎస్ఎఫ్ఏ)ను రామ్‌చరణ్, చాణిక్య అందుకున్నారు. దీంతో ఈ అవార్డు అందుకున్న విద్యార్థులను కళాశాల యాజమాన్యం, అధ్యాపక బృందం విద్యార్థులు అభినందనలు తెలిపారు.

తారకరత్న ప్రథమ వర్ధంతి



కుప్పం, ఫిబ్రవరి 18: కుప్పంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆదివారం నందమూరి తారకరత్న ప్రథమ వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటాన్నుంచి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీఎస్.మునిరత్నం, మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్, రూరల్ మండల అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్, క్లస్టర్ ఇన్‌ఛార్జి వీజీ.ప్రతాప్, చిత్తూరు పార్లమెంట్ తెలుగు మహిళ అధ్యక్షురాలు అరుణ, ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీని ఆదరించండి



కాణిపాకం క్రాస్‌రోడ్డులో కరపత్రాలు పంపిణీ చేస్తున్న మురళీమోహన్

తవణంపల్లె, ఫిబ్రవరి 18: టీడీపీని ఆదరించాలని టీడీపీ పూతలపట్టు ఇన్‌ఛార్జి మురళీమోహన్ అన్నారు. ఆదివారం మండలంలోని పట్నం, కాణిపాకం క్రాస్‌రోడ్డు, పట్నం పైపల్లె తదితర గ్రామాల్లో ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమం చేపట్టారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారంటీ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు గాలి దిలీప్, మాజీ జడ్పీటీసీ వెంకటేష్ చౌదరి, క్లస్టర్ ఇన్‌ఛార్జి మోహన్‌నాయుడు, నాయకులు గోపి, లవకుమార్, మధు, శరవణలతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చెరకు పంట దగ్ధం



వెదురుకుప్పం, ఫిబ్రవరి 18: వెదురుకుప్పం మండలం తిరుమలయ్యపల్లె పంచాయతీ బాలుపల్లెకు చెందిన ఎం.జగన్నాథరెడ్డి, ఎం.నాగిరెడ్డిలకు చెందిన చెరకు పంట ఆదివారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా కాలిపోయిందని రైతులు తెలిపారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.లక్ష నష్టం జరిగిందని, ప్రభుత్వపరంగా ఆదుకోవాలని కోరారు.

కాణిపాకంలో ఘనంగా మద్వాచార్యుల జయంతి



ఐరాల (కాణిపాకం), ఫిబ్రవరి 18: కాణిపాకంలో ఆదివారం మద్వాచార్యులు జయంతిని అర్చకులు, పండితులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అలంకార మండపంలో మద్వాచార్యుల చిత్రపటాన్ని ఉంచి వివిధ పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఈవో వెంకటేశు, సూపరింటెండెంట్ కోదండపాణి, ఆలయ ఇన్‌స్పెక్టర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

బలిజ సంఘం అధ్యక్షుడిగా రామదాసు



రామదాసును సన్మానిస్తున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

చిత్తూరు, ఫిబ్రవరి 18: చిత్తూరు నగర బలిజ సంఘం అధ్యక్షుడిగా ఓఎం రామదాసు ఎన్నికయ్యారు. నగర బలిజ సంఘం సమావేశం ఆదివారం ఆ సంఘ కార్యాలయంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు హాజరయ్యారు. ఈ సందర్భంగా బలిజ సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా రామదాసు, సెక్రటరీగా భవాని రెడ్డెప్ప, కోశాధికారిగా పూల చందు, ఉపాధ్యక్షులుగా నందగోపాల్, కిశోర్, విశ్వనాథ్, కోలా కిరణ్, చక్రి, నరసింహా, హరిప్రసాద్‌తో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఏఎస్ మనోహర్, మాజీ మేయర్ కఠారి హేమలత, సంఘ నేతలు డీకేఏ బద్రినారాయణ, కాజూరు బాలాజీ పాల్గొన్నారు.

కాజూరు టు ఇరువారం.. మధ్యలో వ్యర్థాలు



భవన నిర్మాణ వ్యర్థాలను రోడ్డుపైనే పోస్తున్న ట్రాక్టర్లు

చిత్తూరు సిటీ, ఫిబ్రవరి 18 : రోడ్డుపైనే భవన నిర్మాణ వ్యర్థాలను వేస్తుండటంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. నగర శివారులోని కాజూరు నుంచి ఇరువారం వరకు ఉన్న రోడ్డు పక్కన భవన నిర్మాణ వ్యర్థాలను విచ్చలవిడిగా వేస్తున్నారు. బెంగళూరు - తిరుపతి రోడ్డు కావడంతో ఎక్కువగా వాహనాలు ఈ మార్గంలో ప్రయాణిస్తుంటాయి. అలాగే యాదమరి, బంగారుపాళ్యం తదితర ప్రాంతాల నుంచి వందల సంఖ్యలో ద్విచక్రవాహనదారులు వస్తుంటారు. రోడ్డుపై ఉన్న భవన వ్యర్థాల వల్ల ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు స్పందించి ఇక్కడ వ్యర్థాలు తొలగించాలని, అలాగే వ్యర్థాలను ఇక్కడవేయకుండా చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

రెండో రోజూ తప్పని ప్రయాణికుల తిప్పలు



ఆర్టీసీ బస్టాండులో వేచివున్న ప్రయాణికులు

పలమనేరు, ఫిబ్రవరి18 : ముఖ్యమంత్రి జగన్ పుణ్యమా అని పలమనేరులో రెండోరోజు ఆదివారం కూడా ప్రయాణికులకు తిప్పలు తప్పలేదు. ఆదివారం ముఖ్యమంత్రి జగన్ అనంతపురం జిల్లా రాప్తాడులో నిర్వహించే సభ కోసం జనసమీకరణకు ఆర్టీసీ అధికారులు పలమనేరు డిపోనుంచి 35పైగా సర్వీసులను రద్దుచేసి బస్సులను రాప్తాడుకు పంపారు. దీంతో కేవలం డిపోలో ఉన్న 20కి లోపు బస్సులు ఎప్పుడు వస్తాయో, ఎక్కడికి వెళ్తాయో కూడా తెలియక ఆదివారం ప్రయాణికులు బస్టాండులో పడిగాపులు పడ్డారు. కొందరు ప్లాట్‌ఫారంలపై వేసిన కుర్చీల్లో కూర్చొని కునుకులోకి జారుకొన్నారు.

ప్రయాణికుడు రియాజ్ : తాను వి.కోటకు వెళ్లాలని బస్టాండుకు వచ్చి రెండున్నర గంటలుగా బస్సులకోసం వేచి ఉన్నానని వి.కోటకు చెందిన ప్రయాణికుడు రియాజ్ తెలిపారు. కనీసం గంటకు ఒక్క బస్సుకూడా లేకపోతే ఎలా అని, పలమనేరు-కుప్పం మార్గంలో ఉన్న వికోట మీదుగా ప్రతిరోజు లెక్కలేనన్ని బస్సులు నడిచేవని ఈరోజు మాత్రం రెండున్నర గంటలు వేచి ఉన్నా ఒక్క బస్సుకూడా రాలేదన్నారు.

రౌడీయిజానికి వైసీపీ అల్లరి మూకలు 'సిద్ధం'

బంగారుపాళ్యం, ఫిబ్రవరి 18: వైసీపీ రౌడీయిజానికి సిద్ధమైందని టీడీపీ మండల అధ్యక్షులు ఎన్‌పీ జయప్రకాష్ విమర్శించారు. ఆంధ్రజ్యోతి ఫొటో గ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీ మూకలు దాడి చేయడంపై ఆదివారం పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ రాబోయే ఎన్నికల్లో ఓడిపోతామని తెలిసి ఇలా సిద్ధం పేరుతో రౌడీయిజానికి సిద్ధ పడుతున్నారని ఎద్దేవాచేశారు. దాడిచేసిన వారిని వెంటనే అరెస్టు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో తెలుగు యువత రమేష్, మండల పార్టీ ఉపాధ్యక్షులు కమలనాథరెడ్డి, లోకనాథనాయుడు, సింగిల్ విండో అధ్యక్షులు హేమచంద్రనాయుడు తదితరులు పాల్గొన్నారు.

నేడు స్పందన

చిత్తూరు, ఫిబ్రవరి 18: చిత్తూరు నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం జరుగుతుందని కమిషనర్ అరుణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం వరకు ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరిస్తామని తెలిపారు. అదేవిధంగా మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అన్ని సచివాలయాల్లో ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరిస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రాజీవ్ టెక్నాలజీ పైప్‌లైన్‌కు మరమ్మతులు



విజయపురం, ఫిబ్రవరి 18: మండలంలోని ఇళ్లత్తూరులో రాజీవ్ టెక్నాలజీ పైప్‌లైన్‌కు కాంట్రాక్టరు నాగేంద్ర ఆదివారం మరమ్మతు పనులు నిర్వహించారు. ఇళ్లత్తూరులో తాగునీటి సమస్య అంటూ పత్రికలో కథనం రావడంపై స్పందించారు. తాగునీటి సమస్య పరిష్కారం కావడంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

చెరువు కట్ట కబ్జా



కార్వేటినగరం, ఫిబ్రవరి 18: కార్వేటినగరం మండలం ఎంఎం విలాసం గ్రామ పంచాయితీ గుండుగాని దళితవాడ సమీపంలోని అమ్మగారి చెరువు కట్టను అధికార పార్టీకి చెందిన ఒక నాయకుడు కబ్జా చేస్తున్నాడని అక్కడి రైతులు వాపోతున్నారు. ప్రశ్నిస్తే దౌర్జన్యానికి దిగుతున్నాడని ఆ ప్రాంత దళితులు వాపోతున్నారు. రెవెన్యూ అధికారులు స్పందించి చెరువును కాపాడాలని కోరుతున్నారు.

సాయిబాబాకు ప్రత్యేక పూజలు



శ్రీరంగరాజపురం, ఫిబ్రవరి 18: ఎస్ఆర్‌పురం మండలం పుల్లూరు క్రాస్‌రోడ్డులో వెలసిన షిరిడి సాయిబాబ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయానికి వచ్చిన తిరుపతి జిల్లా నియోజకవర్గం పరిశీలకులు చిట్టిబాబు నాయుడు, టీడీపీ జిల్లా ప్రత్యేక ఆహ్వానితులు బోడపాటి లోకనాథంనాయుడును ఆలయ సభ్యులు శాలువతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మాజీ మండల అధ్యక్షుడు భాస్కర్‌నాయుడు, మాజీ ఎంపీటీసీ గిరి నాయుడు, సిద్ధయ్యశెట్టి తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత కంటి వైద్యశిబిరం

గంగాధరనెల్లూరు, ఫిబ్రవరి 18: మండలంలోని తూగుండ్రం దళితవాడ చర్చివద్ద సోమవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు ఉచిత కంటి వైద్యశిబిరం జరుగుతుందని సీఎస్ఐ చర్చి పాస్టర్ దేవేంద్రన్, సభామనేగర్ జీవరత్నం తెలిపారు. చెన్నైకి చెందిన ఎం.ఎన్.కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో తూగుండ్రం సీఎస్ఐ చర్చి సహకారంతో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

వైసీపీ జిల్లా జనరల్ సెక్రటరీగా వాణి



గుడిపాల, ఫిబ్రవరి 18: జిల్లా వైసీపీ జనరల్ సెక్రటరీగా గుడిపాల మండలం పశుమందకు చెందిన వాణి నియమితులయ్యారు. ఆదివారం ఆ పార్టీవర్గాలు అధికారికంగా ప్రకటించాయి.

ఘనంగా రిషి ప్రభాకర్ గురూజి వర్ధంతి



పూజలు చేస్తున్న సిద్ధి సమాధియోగా నిర్వాహకులు

చిత్తూరు కల్చరల్, ఫిబ్రవరి 18: రెడ్డిగుంట వికలాంగ బాలకల వసతి గృహంలో ఆదివారం సిద్ధి సమాధి యోగా వ్యవస్థాపకులు ప్రభాకర్ గురూజి 10వ వర్ధంతి వేడుకలు అత్యంత భక్తి ప్రపత్తులతో నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు యోగాసనాలు, ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం యోగా గురువు నరేంద్రకుమార్, బ్రహ్మయ్యలు విద్యార్థులకు పండ్లు, పాలు, దుస్తులు, పుస్తకాలు, పెన్నులు వితరణ చేశారు.

పత్రికా స్వేచ్ఛను హరించడానికి వైసీపీ 'సిద్ధం'

● టీడీపీ నేతల విమర్శ

చిత్తూరు సిటీ, ఫిబ్రవరి 18: పత్రికా స్వేచ్ఛను హరించడానికి వైసీపీ 'సిద్ధం'గా వుందని టీడీపీ నేతలు విమర్శించారు. ఆదివారం అనంతపురం జిల్లా రాప్తాడులో నిర్వహించిన సీఎం సభలో కవరేజ్‌లో ఉన్న ఆంధ్రజ్యోతి ఫొటో గ్రాఫర్ కృష్ణపై వైసీపీ శ్రేణుల దాడిని వీరు ఆదివారం ఒక ప్రకటనలో ఖండించారు. జర్నలిస్టులపై దాడిని ప్రజలందరూ ఖండించాలని ఇది ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టులాంటిదని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి సురేంద్రకుమార్ పేర్కొన్నారు. వైసీపీ గూండాల దౌర్జన్యాల పరాకాష్టకు ఈదాడి నిదర్శనమని జిల్లా పార్టీ అధ్యక్షుడు పులివర్తి నాని తెలిపారు. ప్రజలను భయభ్రాంతులకు గురిచేసి, పత్రికా స్వేచ్ఛను హరించి ఎలాగైనా వైసీపీ గెలవాలని ప్రయత్నిస్తోందని ప్రజలు అన్నీ గమనిస్తున్నారని దుర్మార్గపు వైసీపీ ప్రభుత్వానికి ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని పార్టీ ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్ తెలిపారు. ఇది అత్యంత హేయమైన చర్య అని రాజకీయలకు అతీతంగా ప్రతి ఒక్కరూ ఇలాంటి దాడులను ఖండించాలని టీడీపీ సీనియర్ నేత గురజాల జగన్మోహన్ పేర్కొన్నారు. జర్నలిస్టులకే రక్షణ లేకపోతే సామాన్య ప్రజలకు ప్రభుత్వం ఎలా రక్షణ కల్పిస్తుందని పార్టీ సీనియర్ నేత చంద్రప్రకాష్ ప్రశ్నించారు. వైసీపీ గూండాలు దేనికైనా తెగించేందుకు సిద్ధపడుతున్నారని, ప్రజలకు, ప్రభుత్వానికి వారధులుగా ఉన్న జర్నలిస్టులపై దాడులు చేయడం హేయమైన చర్య అని మాజీ మేయర్ కటారి హేమలత తెలిపారు. జర్నలిస్టుపై దాడి చాలా బాధాకరమని ఇలాంటి దాడులను ప్రోత్సహించడం ప్రజా స్వామ్యమనుగడకు అత్యంత ప్రమాదకరమని పార్టీ ఉపాధ్యక్షుడు కాజూరు బాలాజి తెలిపారు. ఆంధ్రజ్యోతి ఫోటోగ్రాఫర్‌పై దాడి ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టని పార్టీ రాష్ట్ర తెలుగుమహిళ ఉపాధ్యక్షురాలు వైవీ రాజేశ్వరి, కార్యనిర్వాహక కార్యదర్శి సీఎం విజయ, జిల్లా పార్టీ అధ్యక్షురాలు వైవీ రాజేశ్వరి నేతలు సీఆర్ రాజన్, సప్తగిరి ప్రసాద్, మోహన్‌రాజ్, వెంకటేష్ యాదవ్, కాజూ రు రాజేష్, రాజశేఖర్, ప్రభుతేజ, ఫైరోజ్, అత్తుబాయ్, జాఫర్ తదితరులు ఆ ప్రకటనలో ఖండించారు. నిన్న అమరావతి, నేడు రాప్తాడులో పాత్రికేయులపై దాడులు చేసినవారిపై తక్షణం కేసులు నమోదు చేసి అరెస్టు చేయాలని, లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేపడతామని చిత్తూరు ప్రెస్‌క్లబ్ కమిటీ, జిల్లా ఏపీయూడబ్ల్యూజే సభ్యులు హెచ్చరించారు.

ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై దాడి
జగన్ అరాచకానికి సాక్ష్యం

కార్వేటినగరం, ఫిబ్రవరి 18: రాప్తాడులో సీఎం జగన్ పర్యటన సందర్భంగా ఫొటోలు తీస్తున్న ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై వైసీపీ మూకలు దాడిచేయడం వైసీపీ అరాచకానికి సాక్ష్యమని కార్వేటినగరం మండలంలోని ప్రతిపక్ష నాయకులు పేర్కొన్నారు. ఫొటోగ్రాఫర్‌పై వైసీపీ దాడి చేయడం పత్రికా స్వేచ్ఛపై దాడి చేయడమేనని జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి యుగంధర్ ఖండించారు. ● రాష్ట్రంలో అరాచక పాలనకు ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై దాడి ఒక నిదర్శనమని టీడీపీ చిత్తూరు పార్లమెంటరీ నియోజకవర్గ తెలుగు రైతు అధ్యక్షులు నాగేశ్వరరాజు, చిత్తూరు జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి గోవర్ధన్ రెడ్డి ఖండించారు.

జగన్ నిజస్వరూపం ఇదే..!

సమాజంలో ప్రజల సమస్యలపై ప్రభుత్వాలను నిల దీస్తున్న పాత్రికేయులపై వైసీపీ కార్యకర్తలు దాడి చేయడం హేయం. అనంతపురంలో జరిగిన సిద్ధం సభను చిత్రీకరిస్తున్న ఆంధ్రజ్యోతి ఫొటో గ్రాఫర్ శ్రీకృష్ణపై దాడిని ప్రజాస్వామికవాదులంతా ఖండించాలి. ఎక్కడికక్కడ 'సిద్ధం' అంటూ హోర్డింగులు వేసి ఉంటే ముఖ్యమంత్రి ప్రజల కేదైనా మంచి జరిగే కార్యక్రమాలు చేయడానికి సిద్ధంగా ఉన్నాడేమో అను కున్నా. ఇలా దాడులకు సిద్ధం అని ఊహించ లేకపోయాం. సీఎం ప్రేరేపణతోనే శ్రీకృష్ణపై దాడి జరిగింది. ఇది సీఎం జగన్ నిజస్వరూపానికి నిలువెత్తు సాక్ష్యం. జగన్ తన నిజస్వరూపాన్ని స్వయంగా బయట పెట్టుకున్నారు. ఈ రాక్షస ప్రభుత్వం పోవాలంటే కొద్ది రోజులు ఆగాలి. తర్వాత మంచిరోజులొస్తాయి.



గంగాధర నెల్లూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ థామస్

ఉత్తుత్తి దత్తత ఎందుకు స్వామీ

● ఎస్టీ కాలనీకే న్యాయం చేయలేని అసమర్థుడివి
● డిప్యూటీ సీఎంపై జనసేన ఫైర్

పెనుమూరు, ఫిబ్రవరి 18: 'నారాయణస్వామీ.. పాళ్యం యానాది కాలనీ పేరు గుర్తుందా... అదే నేను దత్తత తీసుకుంటున్నాను అని కలెక్టర్, ప్రజల మధ్య నువ్వు పలికిన మాటలు గుర్తున్నాయా... మరి దత్తత తీసుకుని ఆ గ్రామాన్ని ఏం ఉద్ధరించావు' అని జనసేన జీడీనెల్లూరు నియోజకవర్గ బాధ్యులు పొన్న యుగంధర్ ప్రశ్నించారు. ఆదివారం ఆయన పెనుమూరు మండలంలోని చిప్పార పల్లి పంచాయతీలో పాళ్యం యానాది కాలనీని జనసేన నాయకులతో కలిసి సందర్శించారు. ఆ గ్రామానికి రోడ్డు లేక, తాగునీటి సౌకర్యంలేక, వసతులు లేక కాలనీ వాసులు పడుతున్న అవస్థలు స్వయంగా పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ పాళ్యంయానాది కాలనీని నాలుగేళ్ల క్రితం దత్తత తీసుకున్న నారాయణస్వామి ఆ గ్రామానికి ఒక్క రూపాయి అయినా ఖర్చు పెట్టి చిన్న అభివృద్ధిపనైనా చేశారా అని ప్రశ్నించారు. దత్తత తీసుకున్న కాలనీని పట్టించుకోని పెద్దమనిషి నియోజకవర్గాన్ని ఏం పట్టించుకుంటాడో ప్రజలు ఆలోచించాలని ఆయన మనవి చేశారు. రెండు పర్యాయాలు స్వామికి జేజేలు పలికిన ప్రజలు నేడు వీడ్కోలు పలికేందుకు సిద్ధంగా ఉన్నారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షులు శ్రీనివాసులు, రామక్రిష్ణ, శేఖర్, నాగేంద్ర, రాజు, రేణుక ఇతర నాయకులు పాల్గొన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న జనసేన నాయకులు

వైసీపీని సాగనంపడానికి సిద్ధంగా ఉండండి : గాలి భానుప్రకాశ్

● టీడీపీ తీర్థం పుచ్చుకున్న 30 కుటుంబాలు

విజయపురం, ఫిబ్రవరి 18: వైసీపీని ఇంటికి సాగనంపడానికి సిద్ధంగా ఉండాలని నగరి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ గాలి భానుప్రకాశ్ పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని మల్లారెడ్డి కండ్రిగలో జనసేన సమరసింహారెడ్డి, టీడీపీ నాగరాజు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. మల్లారెడ్డి కండ్రిగ, ఎస్టీ కాలనీ, ఆదిఆంధ్రవాడ, బీసీ కాలనీలో కాంగ్రెస్, జనసేన, వైసీపీల నుంచి సుమారు 30 కుటుంబాలు గాలి భానుప్రకాశ్ సమక్షంలో టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధి జరగాలన్నా, పిల్లలకు మంచి భవిష్యత్తు కల్పించాలన్నా, రాష్ట్రాన్ని దోపిడి దారుల నుండి కాపాడాలన్నా వైసీపీని ఇంటికి పంపాలన్నారు. లేకపోతే మన బిడ్డల భవిష్యత్తు అంధకారమవుతుందని తెలియజేశారు. అరాచకం, దౌర్జన్యం మరింత విస్తరిస్తాయని హెచ్చరించారు. అనంతరం ఇంటింటా సూపర్ సిక్స్ హామీల కరపత్రాలు పంపిణీ చేశారు. జనసేన నుంచి గోవర్ధన్, మునిరత్నం, సుబ్రహ్మణ్యం, గజపతి, రాజేంద్రరాజు, పొలసాని దినేష్, కాంగ్రెస్ నుంచి మునిశేఖర్‌శెట్టి, వైసీపీ నుంచి సుధాకర్‌రాజు తదితరులు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి చుక్కా ధనుంజయయాదవ్, టీడీపీ మండల అధ్యక్షుడు రమేశ్‌రాజు, ప్రధాన కార్యదర్శి బాబుయాదవ్, నాయకులు రాఘవరాజు, బాలసుబ్రహ్మణ్యంరాజు, దశరథరాజు, సుధాకర్‌రాజు, నాథముని, భాస్కర్, కాశిరెడ్డి, మునస్వామి, మునివరాల్, మునిశేఖర్, వేణుగోపాల్‌నాయుడు, శివలింగం, గుణశేఖర్‌రెడ్డి, సుధానాయుడు, శివయ్యనాయుడు, కపిల్, అశోక్, మునిభాస్కర్‌రాజు, వెంకటేసులు యాదవ్, పురుషోత్తం, శ్యాం పాల్గొన్నారు.



భానుప్రకాశ్‌ను సన్మానిస్తున్న నాయకులు

వైభవంగా లక్ష్మీనారాయణుల కల్యాణోత్సవం

గంగాధరనెల్లూరు, ఫిబ్రవరి 18: మండలంలోని వేపంజేరి గ్రామంలో వెలసిన లక్ష్మీనారాయణుల కల్యాణోత్సవం వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఆదివారం ఉదయం మొదట స్వామి, అమ్మవార్లను సుప్రభాతసేవతో మేల్కొలిపి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఉత్సవమూర్తులైన శ్రీదేవి, భూదేవి సమేతుడైన నారాయణులకు పట్టువస్త్రాలు, పూలహారాలతో అలంకరణలు చేశారు. అర్చకులు వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ కల్యాణోత్సం జరిపించారు. ఈ పూజలకు చిత్తూరుకు చెందిన సింధుప్రియ, కీర్తి, దొడ్డిపల్లెకు చెందిన జ్యోతీశ్వరి ఉభయదారులుగా వ్యవహరించారు. వారికి ఆలయం తరపున పట్టువస్త్రాలతో సత్కరించి స్వామివారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు. భక్తులకు జ్యోతీశ్వరి అన్నదానం చేశారు. టీటీడీకి చెందిన అన్నమాచార్య ప్రాజెక్ట్ తరపున భాగవతారిణి ఎస్.పద్మజ హరికథ కాలక్షేపం చేయగా, వెంకటేశ్వర భక్తిగీతాలు, అన్నమయ్య కీర్తనలను తులసి ఆలపించారు. ఈ కార్యక్రమంలో యూఎస్ఏకి చెందిన కుమార్, రజని దంపతులు, ఆలయ మేనేజర్ నల్లా వెంకటేషులురెడ్డి, ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.



శ్రీదేవి, భూదేవిలకు మంగళసూత్రాలను సమర్పిస్తున్న అర్చకులు

వైసీపీ ప్రభుత్వ పతనం ఖాయం : అమర్

పలమనేరు, ఫిబ్రవరి18 : రానున్న ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వ పతనం ఖాయమని మాజీ మంత్రి అమరనాథరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఇంటింటి తెలుగుదేశం కార్యక్రమంలో భాగంగా పలమనేరు మున్సిపాలిటీ లక్ష్మీనగర్‌కాలనీలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ నాలుగున్నర ఏళ్లలో జగన్ తీసుకొన్న నిర్ణయాలు, వైసీపీ నేతల దౌర్జన్యాలు, అక్రమాలతో ప్రజలు పూర్తిగా విసిగి పోయారన్నారు. అన్నివర్గాల్లో జగన్ ప్రభుత్వంపై పూర్తి అసంతృప్తి నెలకొందని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేనతో కూడిన ప్రభుత్వం ఏర్పడడం ఖాయమని ఆయన స్పష్టం చేశారు. అనంతరం ఆర్కే స్ట్రీట్, లక్ష్మీనగర్, కేవీఎస్ స్ట్రీట్, మసీదువీధి, ఓఎల్ఎల్ యూపీ స్కూల్ క్రాస్, మార్కెట్‌యార్డు ప్రాంతాల్లో పర్యటించారు. కార్యక్రమంలో నాయకులు ఆర్బీసీకుట్టి, గిరిబాబు, ఛాంద్‌బాషా, సుబ్రమణ్యంగౌడు, ఖాజాపీర్, నాగరాజు, బాబాజాన్, హనీఫ్, లోకేష్‌ఆచారి, షరీఫ్, షకీల్, ప్రేమ్, గౌస్, యూసఫ్, పర్వీన్, జనసేన నాయకులు దిలీఫ్, చైతన్య, హరీష్, నాగరాజు, రమేష్ పాల్గొన్నారు.



పలమనేరు లక్ష్మీనగర్ కాలనీలో పర్యటిస్తున్న అమరనాథరెడ్డి

సీకే బాబుకు సన్మానం

చిత్తూరు సిటీ/ చిత్తూరు కల్చరల్, ఫిబ్రవరి 18 : మాజీ ఎమ్మెల్యే సీకే బాబును ఆయన అభిమానులు ఘనంగా సన్మానించారు. ఆదివారం నగరంలోని గంగినేని చెరువు సమీపంలోని వీరభద్ర స్వామి ఆలయంలో మైలారు పండుగ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సీకే బాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికి స్వామివారి తీర్థప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు పురుషోత్తం, మురళి, జ్యోతిరాజ్, శీన, వెంకటేష్ ఆచారి, అభిమానులు కుట్టి, సురేంద్రరెడ్డి, ప్రసాద్, సురేష్, సెంథిల్, వెంకటేష్, కుట్టి తదితరులు పాల్గొన్నారు. ● అదేవిధంగా రజక కులపెద్దలు సీకేబాబును సత్కరించారు.

ఏఆర్ఎస్ పార్టీ అన్నిస్థానాల్లో పోటీ చేస్తుంది



ససమావేశంలో మాట్లాడుతున్న ఏఆర్ఎస్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు కోటేశ్వరరావు

చిత్తూరు రూరల్, ఫిబ్రవరి 18: రానున్న ఎన్నికల్లో ఏఆర్ఎస్ పార్టీ అన్ని స్థానాల్లో పోటీ చేస్తుందని ఆ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు కోటేశ్వరరావు స్పష్టం చేశారు. ఆ పార్టీ చేపట్టిన ప్రజా ఎదుగుదల యాత్ర ఆదివారం చిత్తూరులోని మురకంబట్టుకు చేరుకుంది. అక్కడ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పేద, బడుగు, బలహీన వర్గాల వారి అభివృద్ధిని కాంక్షించిన గత ఏడాది పార్టీని స్థాపించినట్లు తెలిపారు. ఈ యాత్ర ద్వారా ఏఆర్ఎస్ పార్టీ మ్యానిఫెస్టోను ప్రజలకు వివరిస్తున్నట్లు ఆయన తెలిపారు. రాష్ట్ర రాజధానిలో ప్రతి డ్వాక్రా గ్రూపునకు వెయ్యి గజాల స్థలాన్ని కేటాయిస్తామన్నారు. రానున్న ఎన్నికలో తమ పార్టీకి ఓటు వేసి గెలిపించాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో పార్టీ ఉపాధ్యక్షుడు పద్మ, మైనారిటీ నాయకులు భాష పఠాన్ తదితరులు పాల్గొన్నారు.

నిత్య భజనలకు అవకాశం కల్పించాలి

ఐరాల(కాణిపాకం), ఫిబ్రవరి 18: ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకంలో నిత్య భజనలు చేసేందుకు అవకాశం కల్పించాలని జానపద, వృత్తి కళాకారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మురళి కోరారు. ఆదివారం కాణిపాక క్షేత్రంలో వరసిద్ధునికి కళా నైవేద్యం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వంద మందికి పైగా కళాకారులు విచ్చేసి అగరంపల్లె ఆర్చి నుంచి ఆలయం వరకు పిల్లనగ్రోవులు, తాళం భజన, కోలాటాలు, చెక్కభజన, కులుకు భజన, సంకీర్తనలు ఆలపిస్తూ స్వామికి కళా నైవేద్యం సమర్పించారు. అనంతరం ఆస్థాన మండపంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మురళి మాట్లాడుతూ కళాకారులకు ప్రత్యేక వేదిక ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అన్నమయ్య కళాక్షేత్రం పీఠాధిపతి విజయశంకరస్వామి, ఆ సంఘం అధ్యక్షుడు జగన్మోహన్ రావు, తదితరులు పాల్గొన్నారు.





సమావేశంలో మాట్లాడుతున్న మురళి, భజనలు, కోలాటాలతో స్వామికి కళా నైవేద్యాన్ని సమర్పిస్తున్న కళాకారులు